

ఒక సూది.. ఆరు మాత్రలు..

రాయచోటి ప్రజలు ఎంతో కాలంగా ఎదురుచూస్తూ వచ్చిన వంద పడకల ఆసుపత్రి ఎట్టకేలకు రానే వచ్చింది. అత్యాధునికంగా 100 పడకల ఆసుపత్రిని గత నెలలో ప్రారంభించారు. అయితే అట్టహాసంగా ప్రారంభించారు కానీ అందులో ఎటువంటి పరికరాలు ఏర్పాటు చేయలేదు. వైద్యులను నియమించలేదు. రోగులకు కనీస సౌకర్యాలు కూడా ప్రభుత్వం ఇంతవరకు కల్పించలేదు. దీంతో పాత ఏరియా ఆసుపత్రిలోనే ప్రస్తుతం రోగులను పరీక్షిస్తున్నారు.



- వంద పడకల ఆసుపత్రిలో సౌకర్యాలు నిల్
- హడావుడిగా ప్రారంభం.. అపై నిర్లక్ష్యం
- ప్రేక్షకపాత్రలో అధికార యంత్రాంగం



నిర్మానుష్యంగా ఉన్న వంద పడకల ఆసుపత్రి



దోరు తెరుచుకోని ఆపరేషన్ థియేటర్

రాయచోటి (కలెక్టరేట్), ఫిబ్రవరి 9: రాయచోటి ప్రాంత ప్రజల కోసం ప్రభుత్వం వంద పడకల ఆసుపత్రిని నిర్మించింది. రెండు సంవత్సరాల్లో పూర్తి చేయాల్సిన ఈ ఆసుపత్రిని దాదాపు మూడు సంవత్సరాల తర్వాత ప్రారంభించారు. అయితే ఈ ఆసుపత్రిలో ఒక్క స్టూలు, బెంచ్ కూడా ప్రభుత్వం ఇంతవరకు ఏర్పాటు చేయలేదు. పేషెంట్స్ ఆసుపత్రికి వస్తే ఒక సూది, ఆరుమాత్రలు ఇచ్చి పంపించేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. హంగామా ఫుల్ ఆచరణ నిల్ అన్న సామెతలో ఈ ఆసుపత్రి నడుస్తోందని తెలుస్తోంది. గతంలో ఏరియా ఆసుపత్రిగా ఉన్నప్పుడు రాయచోటి పట్టణ పరిసర ప్రాంతాల్లో ఏ ఒక్క యాక్సిడెంట్ జరిగినా ఇక్కడ ఉన్న డాక్టర్లు వెంటనే తిరుపతికి లేక కడపకు రెఫర్ చేసేవాళ్లు. వంద పడకల ఆసుపత్రి వచ్చినా అదే విధానం అమలవుతోందనే ఆరోపణలు ఉన్నాయి. వంద పడకల ఆసుపత్రి ప్రారంభించిన తర్వాత మంచి వైద్యం ప్రజలకు అందుబాటులోకి వచ్చింది అనుకునేలోపే పాలకుల నిర్లక్ష్యం కారణంగా సౌకర్యాలు కల్పించలేదు. ఎన్నికలకు ముందు ఈ ఆసుపత్రి ప్రారంభం చేసి చేతులు దులిపేసుకున్నారని ప్రజలు అనుకుంటున్నారు. రాయచోటి పట్టణానికి దాదాపు 30 కిలోమీటర్ల దూరం ఉన్న వారు అందరూ ఈ ఆసుపత్రికి వచ్చి చికిత్సలు చేయించుకుని వెళ్లే పరిస్థితి ఉంది. ఈ ఆసుపత్రిలో ఇంకా చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఆసుపత్రిలోకి వెళ్లి చూస్తే రూములన్నీ కూడా నిర్మానుష్యంగా దర్శనమిస్తున్నాయి. పిలిస్తే గానీ పలకని రెండు కంప్యూటర్లు, పనికి రాని స్కానింగ్ మిషన్, ఇద్దరు, ముగ్గురు ల్యాబ్ టెక్నీషియన్లు, ముగ్గురు నర్సులు మాత్రమే ఈ ఆసుపత్రిలో కనిపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వంద పడకల ఆసుపత్రిపై దృష్టి పెట్టి ఇక్కడికి రావాల్సిన పరికరాలపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిబంధనలు ఎక్కడా కనిపించలేదు

ముఖ్యంగా మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి అయి ఉండాలి. పీడియాట్రిక్, గైనకాలజిస్ట్, అనస్థీషియా, జనరల్ మెడిసిన్ డాక్టర్‌తో పాటు ఆరుగురు ఎంబీబీఎస్ డాక్టర్లు అదనంగా ఉండాలి. ల్యాబ్ ఫెసిలిటీ ఉండాలి. బ్లడ్ బ్యాంక్ కూడా అందుబాటులో ఉండాలి లేక ఎవరితోనైనా గుర్తింపు కలిగిన బ్లడ్ బ్యాంకుతో అనుసంధానం ఉండాలి. ఆపరేషన్ థియేటర్లు కనీసం మూడు ఉండాలి. ఈ గదుల్లో అన్ని రకాల టెక్నాలజీతో కలిగిన పరికరాలు అందుబాటులో ఉండాలి. అప్తమాలజీ, ఈఎన్‌టీకి ప్రత్యేకంగా డాక్టర్లు ఉండాలి. అందుబాటులో మైక్రోస్కోప్ ఖచ్చితంగా ఉండాలి. వారితో పాటు ఇద్దరు అసిస్టెంట్స్ కూడా ఉండాలి. ప్రత్యేకంగా లేబర్ వార్డు ఉండాలి. కంటి ఆపరేషన్‌కు ప్రత్యేకమైన ఆపరేషన్ థియేటర్ ఉండాలి. ఫ్యామిలీ ప్లానింగ్ యూనిట్ అనే ప్రత్యేకమైన గది ఒకటి ఉండాలి. కనీసం అంటే ఐదుమంది ఫార్మసిస్టులు ఉండాలి. అల్ట్రాసౌండ్ గది మాత్రమే ఉంచారు. అందులో ఏ పరికరాలు లేవు. రేడియాలజిస్ట్ కూడా అందుబాటులో ఉండాలి. అధునాతనమైన ఎక్స్‌రే యూనిట్ ఉండాలి. కానీ ఇవేమీ ఈ ఆసుపత్రిలో కపిఇంచడం లేదు. సిబ్బంది కూడా అంతంత మాత్రంగానే ఉన్నారు.



వంద పడకల ఆసుపత్రిలో తుప్పు పట్టిన ఎక్స్‌రే మిషన్

ఇక్కడ ఏమీ లేవు..



వంద పడకల ఆసుపత్రి అనుకుని మేము బయటికి వెళ్లకుండా ఇక్కడే చూపించుకోవాలని వచ్చాం. అయితే మేము ఊహించినంత ట్రీట్మెంట్ ఇక్కడ లేదు. ఒక సూది, 6 మాత్రలు మాత్రమే ఇచ్చి పంపిస్తున్నారు. దీని వల్ల రోగం నయం కావడం లేదు. హంగామాతో ప్రారంభం చేశారు తప్ప ఇక్కడ సదుపాయాలు ఏమీ లేవు. నేను తిరుపతికి వెళ్లి చూపించుకుందామని అనుకుంటున్నాను.

- రమణయ్య, కొత్తపేట, రాయచోటి

ప్రభుత్వం చొరవ తీసుకోవాలి..



జిల్లా కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి కట్టారు. కానీ ఇక్కడ సౌకర్యాలు లేకపోవడం దారుణం. తగినంత మంది సిబ్బందిని ఏర్పాటు చేసి ఇక్కడ అన్ని రకాల వసతులు వచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. వంద పడకల ఆసుపత్రి కోసం ఎన్నో ఉద్యమాలు చేస్తే వచ్చింది. ప్రారంభం చేసి నెల గడుస్తున్నా ఇప్పటి వరకు కనీసం ఒక బెంచి కూడా ప్రభుత్వం ఇవ్వకుండా ఉంది అంటే ఇక్కడ పాలకుల నిర్లక్ష్యం కంటికి కనపడుతోంది. ఎన్నికల సమయం వస్తుంది కాబట్టి అధికారులు చొరవ తీసుకుని వంద పడకల ఆసుపత్రికి కావాల్సిన పరికరాలు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

- సాంబశివ,
ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి

పరికరాల కోసం నివేదికలు పంపాం..

కొత్తగా నిర్మించిన వంద పడకల ఆసుపత్రి కాబట్టి సౌకర్యాల కల్పనలో కొంత ఆలస్యం అవుతోంది. ఇప్పటి వరకు ఏ రకమైనటువంటి పరికరాలు రాలేదు. ఈ ఆసుపత్రిలో అన్ని రకాల స్పెషలిస్టులు ఉండేవిధంగా చూస్తున్నాం. మేము పరికరాల కోసం ప్రభుత్వానికి సిఫారసులు పంపించాం. త్వరలో అన్ని వసతులు వస్తాయి.

- డేవిడ్‌కుమార్, డీసీహెచ్ సూపరింటెండెంట్

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల

- ఉమ్మడి కడప జిల్లాలో 289 ఖాళీలు
- టెట్, డీఎస్సీ వెంటవెంటనే నిర్వహించడంపై అభ్యంతరం

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 9: ఎట్టకేలకు 289 ఉపాధ్యాయ ఖాళీలతో డీఎస్సీ ప్రకటనలో కదలిక వచ్చింది. అయితే డీఎస్సీ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం తగినంత వ్యవధి ఇవ్వకుండా టెట్, డీఎస్సీ నిర్వహించేందుకు సిద్ధం కావడంపై అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వేర్వేరు సిలబస్ అయినందున రెండు పరీక్షల మధ్య కాస్త సమయం ఉండాలని కానీ ప్రభుత్వం ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందన్న ఉద్దేశ్యంతో వెంటవెంటనే నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తోందని అభ్యర్థులు మండిపడుతున్నారు. టెట్‌లో ఉత్తీర్ణులైన వారే డీఎస్సీ రాసేందుకు అర్హులు. అందువల్ల టెట్‌కు కూడా చాలా ప్రాధాన్యత ఉంది. ఇంకా ఉపాధ్యాయ నియామకాల్లో టెట్ మార్కులకు 20 శాతం వరకు వెయిటేజీ ఉంటుంది. ఈ నేపథ్యంలో డీఎస్సీ రాసే అభ్యర్థులకు టెట్ అత్యంత కీలకమని చెప్పాలి. అయితే టెట్, డీఎస్సీ పరీక్షల నిర్వహణ విషయంలో ప్రభుత్వం తొందరపాటుతో వ్యవహరిస్తోందని అభ్యర్థుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. టెట్‌కు హాజరవుతున్న అభ్యర్థుల నుంచి దరఖాస్తుల స్వీకరణ గురువారం నుంచి ప్రారంభమైంది. ఈనెల 18లోగా దరఖాస్తులు చేసుకుంటే 27వ తేదీ నుంచి మార్చి 9వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహిస్తారు. ఫలితాలు మార్చి 14న విడుదల చేస్తారు. డీఎస్సీకి దరఖాస్తుల స్వీకరణ ఈనెల 12 నుంచి ప్రారంభమై 22వ తేదీతో ముగియనుంది. సాధారణంగా టెట్ ఫలితాలు వెలువడిన తరువాతే డీఎస్సీ పరీక్షలకు షెడ్యూలు ఖరారు చేయాలి. రెండు పరీక్షల మధ్య కనీసం నెల నుంచి 45 రోజులు వ్యవధి ఉండాలి. కానీ ఈ వైసీపీ ప్రభుత్వం అందుకు భిన్నంగా నిర్ణయాలు తీసుకుంది. వచ్చేనెల 14న టెట్ ఫలితాలు వెలువడిన మరుసటిరోజు అంటే 15వ తేదీ నుంచి డీఎస్సీ రాత పరీక్షల నిర్వహణ ప్రారంభమవుతుంది. ఉమ్మడి కడప జిల్లాలో 289 పోస్టులను కేటాయించారు. దీనికి సెకండరీ గ్రేడ్ టీచర్స్ (ఎస్జీటీ) 105, స్కూలు అసిస్టెంటు (ఎస్ఏ) 81, టీజీటీ 103 మొత్తం 289 పోస్టులను జిల్లాకు కేటాయించారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

టీడీపీకి అఖండ విజయాన్ని అందించేందుకు ప్రజలు సిద్ధం

- చంద్రబాబు విజయాన్ని ఫేక్ పోస్టులు ఆపలేవు
- టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రజలు టీడీపీకి అఖండ విజయాన్ని అందించేందుకు సిద్ధంగా ఉన్నారని, వైసీపీ ఫేక్ పోస్టులు చంద్రబాబు విజయాన్ని ఆపలేవని టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తుందని, వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు రాష్ట్ర అభివృద్ధిని పక్కన పెట్టి చంద్రబాబుపై ఫేక్ పోస్టులు పెట్టి ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. ఈ ఫేక్‌పోస్టులను, ఫేక్ ప్రభుత్వాన్ని నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరన్నారు. నిరంతరం రాష్ట్ర అభివృద్ధిని కోరుకునే చంద్రబాబు వెంటే ప్రజలు ఉన్నారని ముఖ్యమంత్రికి బాగా అర్థమైందని అందుకే మారుస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు నియంత పాలనకు బుద్ధి చెప్పేందుకు సిద్ధమయ్యారని, ప్రజలను కొనేందుకు వైసీపీ నోట్ల కట్టలతో ఎన్నికలకు సిద్ధమవుతోందని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎన్నికలకు సిద్ధం కావాలని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే మహోన్నత వ్యక్తి చంద్రబాబు అని కొనియాడారు. సంక్షేమ పథకాలు అందించడంలో చంద్రబాబు ఎప్పుడూ ముందుంటారని, ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సహాయం అందేలా టీడీపీ-జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు సుబ్బరామ్, టీడీపీ నాయకులు ప్రసాద్‌రాజు, చంద్రమౌళి, మాలేపాటి సురేశ్‌నాయుడు, ఎల్‌వీ రమణ, మస్తాన్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా కాదు...

నగదు చెల్లించి వెళ్లారు

- ఇస్తిమాకు ఎంపీ మిథున్‌రెడ్డి ఉచిత రైలు ఏర్పాటు చేశారని ప్రచారం
- భారీగా తరలివచ్చిన ముస్లింలు
- టికెట్ లేకుంటే జరిమానా విధిస్తామన్న రైల్వే అధికారులు
- ఉచితమని వచ్చిన వారు వెనక్కి వెళ్లిన వైనం



ములకలచెరువు నుంచి నంబూరు ఇస్తిమాకు వెళుతున్న ప్రత్యేక రైలు

రాయచోటి, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా నంబూరులో జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఇస్తిమాకు వెళుతున్న ముస్లింలలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ములకలచెరువు నుంచి మదనపల్లె, రోడ్, వాయల్పాడు, కలికిరి, పీలేరు మీదుగా గుంటూరు జిల్లా నంబూరుకు ప్రత్యేక రైలు నడుస్తోంది. ఈ రైలు ములకలచెరువు నుంచి శుక్రవారం రాత్రి బయలుదేరి 10వ తేదీ ఉదయం 10.30 గంటలకు నంబూరుకు వెళుతుంది. తిరిగి 11వ తేదీ ఈ రైలు నంబూరులో బయలుదేరి 12వతేదీ ములకలచెరువుకు వస్తుంది. ఇస్తిమాకు వెళ్లేందుకు ముందుగా ముస్లింలు పోనూ, రానూ రూ.1400 చెల్లించారు. ఇలా ములకలచెరువు, పెద్దతిప్పసముద్రంచ బి.కొత్తకోట మండలాలకు చెందిన ముస్లింలు సుమారు 250 మందికిపైగా ముందుగా నగదు చెల్లించి పేర్లు నమోదు చేసుకున్నారు. ఈ తరుణంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి ఇస్తిమాకు వెళ్లే ముస్లింల కోసం ఉచితంగా రైలు ఏర్పాటు చేశారని సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం జరిగింది. దీంతో ఇస్తిమాకు వెళ్లేందుకు పెద్ద ఎత్తున ముస్లింలు శుక్రవారం రాత్రి ములకలచెరువు రైల్వేస్టేషన్‌కు వచ్చారు. పేర్లు ఉన్న వారు మాత్రమే రైలు ఎక్కాలని, లేదంటే జరిమానా విధించి మధ్యలో దింపేస్తామని రైల్వేశాఖ అధికారులు మైకులో అనౌన్స్‌మెంట్ చేయడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఉచితమని వస్తే ఇలా జరిగిందేటని పెద్ద ఎత్తున వెనుదిరిగారు. తమ ఆధ్యాత్మిక కార్యక్రమానికి రాజకీయ నాయకులు నగదు చెల్లించాలని వచ్చిన ప్రచారం అవాస్తవమని, తామే టికెట్‌కు నగదు చెల్లించి వెళుతున్నామని పలువురు ముస్లింలు తెలిపారు. రాజకీయ నాయకుల డబ్బుతో దైవ కార్యక్రమాలకు వెళ్లే స్థితిలో తాము లేమని బహిరంగంగానే చర్చించుకున్నారు. రాయచోటికి పట్టణానికి చెందిన ముస్లింలు పెద్దఎత్తున ములకలచెరువుకు వచ్చి ఇస్తిమాకు రైలులో బయలుదేరి వెళ్లారు. సోషల్ మీడియాలో ఉచితమన్న ప్రచారం పెద్దఎత్తున జరగడంతో అది నమ్మి వచ్చిన వారు తీరా ఉచితం లేదని తెలియడంతో రాజకీయ నాయకులను తిట్టుకుంటూ వెనుతిరిగారు.

రాష్ట్రాన్ని అప్పులాంధ్రప్రదేశ్‌గా మార్చేశారు

- వైసీపీ ప్రభుత్వంపై నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ధ్వజం



పీలేరులో పార్టీ శ్రేణులతో మాట్లాడుతున్న నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి

పీలేరు, ఫిబ్రవరి 9: సంక్షేమం పేరుతో రూ.11.58 లక్షల కోట్ల అప్పు చేసి అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను వైసీపీ ప్రభుత్వం అప్పులాంధ్రప్రదేశ్‌గా చేసిందని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. పీలేరులోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన రాష్ట్ర బడ్జెట్‌పై విలేఖరులతో మాట్లాడారు. రూ.75 వేల కోట్ల బీసీల సంక్షేమం, బీసీ సబ్-ప్లాన్ నిధులను దారి మళ్లించడమే కాకుండా బీసీల అభివృద్ధి కోసం తెలుగుదేశం ప్రభుత్వం అమలు చేసిన 30 పథకాలను రద్దు చేసిన బీసీల ద్రోహి ముఖ్యమంత్రి జగన్ అన్నారు. మత్స్యకారుల కడుపు కొట్టాడని, నేతన్నల బతుకుల్లో నిప్పులు కురిపించాడని, నూలు, రంగుల ముడి సరుకులపై సబ్సిడీలు రద్దు చేశాడని గుర్తు చేశారు. రైతు భరోసా పథకంలో లబ్ధిదారుల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే కాకుండా సున్నా వడ్డీ రుణాలను రూ.5 లక్షల నుంచి రూ.3 లక్షలకు తగ్గించేశారని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి పథకంలోనూ భారీ స్కామ్‌లు జరిగాయని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత వాటన్నింటిపై సమగ్ర దర్యాప్తు చేపడతామన్నారు. బడ్జెట్‌లో పన్నుల బాదుడు తప్ప కొత్త అంశాలు ఏమీ లేవని పెదవి విరిచారు. అంతకుమునుపు ఆయన గుండెపోటుతో మరణించిన కేవీపల్లె మండలం సొరకాయలపేట పంచాయతీ వంక వడ్డిపల్లె బూత్ ఇన్‌చార్జ్ నాగరాజ మృతదేహానికి నివాళులర్పించారు. వేర్వేరు కార్యక్రమాల్లో పీలేరు, కేవీపల్లె మండలాల టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.

కల్యాణ వైభోగం

- మాఘమాసం ప్రారంభంతో తెలుగు లోగిళ్లలో పెళ్లిసందడి
- 11 నుంచి ఏప్రిల్ వరకూ 28 రోజులు వరుస ముహూర్తాలు
- ఇవి దాటితే తరువాత ఆగస్టులోనే
- మళ్లీ సెప్టెంబరులో బంద్
- ప్రస్తుతానికి కల్యాణ మండపాలన్నీ ఫుల్



కలికిరి, ఫిబ్రవరి 9: మాఘమాసం వచ్చేసింది.. ఇక పెళ్లి భాజాలు మోగనున్నాయి. కాస్త విరామం తరువాత తెలుగు లోగిళ్లలో ఆదివారం నుంచీ మళ్లీ పెళ్లి సందడి నెలకొనబోతోంది. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో మంచి ముహూర్తాలుండటం.. పెళ్లిళ్లతోపాటు గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు వంటి వివిధ రకాల శుభ కార్యాలకు దివ్యమైన మూహూర్తాలు కుదరటంతో ఎటుచూసినా హడావిడి మొదలైంది. కల్యాణ మండపాలన్నీ ముస్తాబవుతున్నాయి. జిల్లాలో వేల సంఖ్యలో వధూవరులు ఒక్కటవబోతున్నారు. ఫిబ్రవరి నెలలో 11 నుంచి 29 తొమ్మిది వరకూ 8 రోజులు, మార్చి నెలలో 2 నుంచి 30 వరకూ 11 రోజులు, ఏప్రిల్ నెలలో 3 నుంచి 26 వరకూ 10 పది రోజులు సిద్ధాంత ముహూర్తాలున్నాయి. సాధారణంగా మాఘమాసం అంటేనే పెళ్లిళ్లకు ఎత్తిన చేయిలాంటిదని చెబుతారు. ఈ ఏడాది మాఘ మాసంతో ఎలాంటి అడ్డంకులు లేకుండా ముహూర్తాలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ నెల దాటిన తరువాత ఆగస్టు నెలలో మాత్రమే మంచి ముహూర్తాలున్నాయని, తిరిగి సెప్టెంబరులో బ్రేక్ పడనుందని పురోహితులు చెబుతున్నారు. మొత్తం మీద ఈ మూడు నెలలు తెలుగిళ్ల ముంగిట మంగళ వాయిద్యాలు హోరెత్తనున్నాయి.

ఈ ఏడాదిలో సిద్ధాంత ముహూర్తాలు



ఈ ఏడాది సిద్ధాంత ముహూర్తాలు ఎప్పుడు పడితే అప్పుడు అందుబాటులో లేవు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల పరిస్థితి ఆశావహంగా ఉండగా ఆ తరువాత శుభ ముహూర్తాలు ఎక్కువగా లేవని పండితులు వివరిస్తున్నారు. వైశాఖ మాసంలో మే 9 నుంచి జ్యేష్ఠ మాసం, ఆషాఢ మాసం, శ్రావణ మాసం అంటే ఆగస్టు 4 వరకూ ఎలాంటి శుభ ముహూర్తాలు లేవని కూడా పురోహితులు స్పష్టం చేస్తున్నారు. అనంతరం శ్రావణంలోనే సెప్టెంబరు 3 వరకూ మంచి ముహూర్తాలున్నాయి. అనంతరం సెప్టెంబరు 4 నుంచి భాద్రపదంలో అక్టోబరు 2 వరకూ కూడా ముహూర్తాలు లేవని కూడా చెబుతున్నారు. ఆ తరువాత ఆశ్వయుజం నుంచి అంటే అక్టోబరు 3 నుంచి కార్తీకం, మార్గశిరం మాసాల్లో డిసెంబరు 30 వరకూ మళ్లీ ముహూర్తాలున్నాయి. ఆ తరువాత జనవరిలో ఎలాంటి ముహూర్తాలు లేవు. మళ్లీ 2025లో రాబోయే మాఘమాసంలో అంటే ఫిబ్రవరి 27 వరకూ ముహూర్తాలున్నాగానీ, ఫాల్గుణ మాసంలో మాత్రం మార్చి 18 వరకూ ఎలాంటి ముహూర్తాలు లేవని కూడా పురోహితులు చెబుతున్నారు.

మొదలైన హడావిడి

మంచి ముహూర్తాలన్నీ మూడు నెలల్లో ముంచుకు రావడంతో ఎక్కడ చూసినా హడావిడి మొదలైంది. ప్రధానంగా బంగారు దుకాణాలన్నీ కళకళలాడుతున్నాయి. అదేవిధంగా వస్త్ర దుకాణాల వ్యాపారం కూడా పుంజుకుంది. ఇక పట్టు వస్త్రాల కోసం నేరుగా కంచి, ధర్మవరంలాంటి నేత పనివారున్న చోటుకే వెళుతున్నారు. కల్యాణ మండపాలతో పాటు వంట పనివారు, బాజాభజంత్రీల వారు కూడా ఎక్కడో ఒకచోట రిజర్వు అయ్యారు. ఇక కేటరింగ్ వ్యాపారులకు కూడా సరిపడా ఆర్డర్లున్నాయి. పూల వ్యాపారులు బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి ఆధునిక రకాల తాజా పూల కోసం ఆర్డర్లు సిద్ధం చేసుకున్నారు. వంటల కోసం అవసరమైన పచారు కొట్లు, సూపర్ బజార్లలో వ్యాపారాలు పుంజుకున్నాయి. ఇక ఫొటో, వీడియోగ్రాఫర్ల పరిస్థితి కూడా భిన్నంగా ఏమీ లేదు. డెకరేషన్ నిపుణులు, షామియానా సప్లయర్లకు అవసరమైన ఆర్డర్లన్నీ చేతుల్లోకి తీసుకుని సమాయత్తమవుతున్నారు. ఇవన్నీ ఒక ఎత్తయితే ప్రధానంగా పురోహితులు ఒక్కో రోజు రెండు పెళ్లిళ్లకు హాజరు కావడానికి కూడా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వీరికి మంచి డిమాండు ఏర్పడింది. స్థానికంగా పురోహితులు దొరకని వారు తిరుపతి, కాణిపాకం, శ్రీకాళహస్తిలాంటి ప్రధాన ఆలయాలున్న ప్రాంతాల నుంచి పురోహితులను సమకూర్చుకుంటున్నారు.

ఆర్డర్లు బుక్ అయ్యాయి..



షామియానాలకు, డెకరేషన్లకు ఆర్డర్లు బుక్ అయిపోయాయి. అవసరమైన వారు మైక్ సెట్‌లు, డీజే సెట్‌లు కూడా ఆర్డర్లు పెట్టారు. ఈ మూడు నెలలు పూర్తి బిజీగా ఉండబోతున్నాము. డెకరేషన్లలో పూల వాడకం బాగా ఉంది. ఆధునిక రకాల పూలు, ఆకర్షణీయమైన అలంకరణలు కోరేవారు అధికమయ్యారు.

- హరినాథ్, షామియానా సప్లయర్, కలికిరి


అందరూ బిజీగా ఉంటారు..



ఈ ఏడాది సిద్ధాంత ముహూర్తాలు స్వల్పంగానే ఉన్నా ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలల్లో మంచి ముహూర్తాలే అందుబాటులో ఉన్నాయి. దీంతో పెళ్లిళ్లు కూడా ఎక్కువగా జరగనున్నాయి. పెట్టుడు ముహూర్తాలు అవసరం లేకుండానే సిద్ధాంత ముహూర్తాలకు పెళ్లిళ్లు జరిగే విధంగా కల్యాణ ఘడియలను నిర్ణయించాము. ఉన్నంతలో ముహూర్తాలు మాత్రం దివ్యంగా ఉన్నాయి. పురోహితులందరికీ కొంచెం తెరిపిలేని విధంగా బిజీ షెడ్యూలు ఏర్పడింది.

- ఆర్.శివకుమార్‌శాస్త్రి, పురోహితుడు, కలికిరి

మూడు నెలల వరకు రిజర్వ్ అయ్యాయి..



మా కాంప్లెక్స్‌లోని రెండు కల్యాణ మండపాలు మూడు నెలల వరకూ రిజర్వు అయ్యాయి. మధ్యలో రెండు మూడు రోజులు మాత్రం ఖాళీగా ఉన్నాయి. అవి కూడా అయిపోతాయి. ఏయే రోజుల్లో ఖాళీగా ఉన్నాయని కొంతమంది అడిగి వెళుతున్నారు. ముహూర్తాలన్నీ ఏకబిగిన రావడంతో మండపాల కొరత రావచ్చు.

- షేక్ సమీవుల్లా, మేనేజరు,
ఏహెచ్‌సీ కల్యాణ మండప కాంప్లెక్స్, కలికిరి

కలెక్టర్ ఆర్డీవో కార్యాలయ సందర్శన



కలెక్టర్ విజయరామరాజుకు పుష్పగుచ్చం అందిస్తున్న ఆర్డీవో

జమ్మలమడుగు, ఫిబ్రవరి 9: జమ్మలమడుగు రెవెన్యూ డివిజనల్ కార్యాలయాన్ని శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ విజయ రామరాజు ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా ఆర్డీవో శ్రీనివాసులుతో మాట్లాడారు. స్ట్రాంగ్‌రూంను పరిశీలించారు. అనంతరం 2024 సార్వత్రిక ఎన్నికలకు రెవెన్యూ డివిజన్ పరిధిలో సిద్ధంగా ఉన్నారా తదితర అంశాలపై చర్చించినట్లు ఆర్డీవో శ్రీనివాసులు తెలిపారు. పోలింగ్ స్టేషన్లు, ఓటర్ల లిస్టు, పోలింగ్ కేంద్రాల్లో సమస్యలుంటే ఈనెల 10వ తేదీలోగా పరిష్కరించాలని ఆదేశించినట్లు ఆర్డీవో తెలిపారు. జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలో గూడెం చెరువు టిడ్కో గృహాల వద్ద రిజిస్ట్రేషన్లకు సంబంధించి కలెక్టర్ అడిగినట్లు ఆర్డీవో విలేకరులకు తెలిపారు.

పోలీసు సిబ్బందికి వీక్లీ బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు



వీక్లీ బెస్ట్ ఫెర్ఫార్మెన్స్ అవార్డు గ్రహీతలతో ఎస్పీ సిద్ధార్థ కౌశల్

కడప (క్రైం), ఫిబ్రవరి 9 : పోలీసు సిబ్బందిని ప్రోత్సహించే క్రమంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశల్ అత్యుత్తమ పనితీరు కనబరిచిన వారికి వీక్లీ బెస్ట్ ఫెర్మార్మెన్స్‌అవార్డును అందిస్తున్నారు. శుక్రవారం ముగ్గురు సివిల్, ఒక ఏఆర్ సిబ్బందిని ఎంపిక చేసిన నగదు రివార్డులు, ప్రశంసాపత్రం అందించి అభినందించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళుతున్న రూ.31.5 లక్షల నగదును స్వాధీనం చేసుకోవడంలో మైదుకూరు పోలీసుస్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ వై.రమేష్‌బాబు కీలక పాత్ర వహించారు. ఇటీవల ప్రొద్దుటూరులో గోవా మద్యం స్వాధీనంలో కీలక పాత్ర వహించిన రాజుపాలెం పీఎస్ హెడ్ కానిస్టేబుల్ కె.నాగాంజనేయులు, ప్రొద్దుటూరు వన్‌టౌన్ పీఎస్ హెడ్ కానిస్టేబుల్ డి.బాబాఫకృద్దీన్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రశంసాపత్రం, నగదు రివార్డులు అందించారు. డీసీఆర్‌బీలో విధులు నిర్వహిస్తున్న ఏఆర్ కానిస్టేబుల్ బీఎస్ పెద్దిరాజును ఎస్పీ అభినందించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు, లోక్‌అదాలత్, ఎలక్షన్ సెల్ విధుల్లో అత్యుత్తమ పనితీరు కనబరచడం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో సిబ్బంది ముందు విధులు నిర్వహించాలని ఎస్పీ ఆకాంక్షించారు.

ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు వీసీ ప్రశంసలు

కడప (ఎర్రముక్కపల్లె), ఫిబ్రవరి 9 : కేంద్ర ప్రభుత్వ గిరిజన వ్యవహారాల శాఖ నిర్వహించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల అధ్యాపక నియామక పరీక్షల్లో వైవీయూ తెలుగుశాఖ పరిశోధక విద్యార్థులు వెంకటయ్య, డాక్టర్ నరేష్ ఉద్యోగాలు పొందారు. వీరిని వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ప్రొఫెసరు ఎస్.రఘునాథరెడ్డి, డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ ఆర్ట్స్ ప్రొఫెసరు తప్పెట రాంప్రసాద్‌రెడ్డి , పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసరు ఎన్.ఈశ్వర్‌రెడ్డి, తెలుగుశాఖ అధ్యక్షురాలు ప్రొఫెసరు పార్వతి అభినందించారు. ఈ నెల 12న విశాఖలో జరిగే రోజ్‌గార్ మేళా అంతర్జాలం ద్వారా ప్రధానమంత్రి నరేంద్రమోడీ నుంచి నియామక పత్రాలు పొందనున్నామని వారు తెలిపారు. ఉద్యోగాలు పొందిన ఓ.వెంకటయ్య, డాక్టర్ నరేష్‌లను ఇతర పరిశోధక విద్యార్థులు అభినందించారు.

అంజన్నను దర్శించుకున్న జిల్లా విద్యాశాఖాధికారి



అంజన్న సన్నిధిలో జిల్లా విద్యాశాఖాధికారి

చక్రాయపేట, ఫిబ్రవరి 9: గండి వీరాంజనేయస్వామిని శుక్రవారం జిల్లా విద్యాశాఖాధికారి అనూరాధ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ అలవలపాటి ముకుందరెడ్డి, చైర్మన్ కావలి కృష్ణతేజ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన అర్చకుడు కేసరి, రఘుస్వామి పూజలు చేశారు. శాలువలు కప్పి ఘనంగా సత్కరించారు. ఆమె బాధ్యతలు చేపట్టిన అనంతరం గండి అంజన్నను దర్శించుకోవడం మొదటిసారి. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కోశాధికారి గంగవరపు శివారెడ్డి, బి. రంగారెడ్డి, చైతన్య స్కూల్ కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి, ఉషాకిరణ్ స్కూల్ కరస్పాండెంట్ రమణారెడ్డి, ధర్మారెడ్డి, రమణ, ఎంఈఓ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మోపెడ్‌కు నిప్పంటించిన ఆగంతకులు



కాలిపోయిన మోపెడ్

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 9: రాయచోటి పట్టణంలోని మహ్మద్‌పురా మసీదులో మౌజన్‌గా పనిచేస్తున్న యాకూబ్‌కు సంబంధించి టీవీఎస్ స్కూటర్‌కు గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పటించారు. మసీదులో పనిచేసే మౌజన్ యాకూబ్ మసీదు బయట నిలిపి ఉంచిన మోపెడ్‌కు గుర్తు తెలియని దుండగులు నిప్పంటించారు. ఈ సంఘటనపై రాయచోటి అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు. కాగా, ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని పోలీసులు చెబుతున్నారు.

రేషన్ బియ్యం పట్టివేత..



పట్టుబడిన ఆటోలో రేషన్ బియ్యం

రామాపురం, ఫిబ్రవరి 9: తరలించేందుకు సిద్ధంగా ఉన్న 12 ప్యాకెట్లలోని 480 కిలోల రేషన్ బియ్యాన్ని తహసీల్దార్ అరవింద కిశోర్, ఎస్ఐ వీఎల్ ప్రసాద్ రెడ్డి స్వాధీనం చేసుకున్నారు. మండల కేంద్రానికి చెందిన పఠాన్ బాబ్‌జాన్ గ్రామాల్లో బియ్యాన్ని కొనుగోలు చేసి వాటిని రాయచోటిలో విక్రయించేందుకు తీసుకువచ్చాడు. బియ్యం లోడు చేసిన ఆటో అతని ఇంటి వద్ద నిలిపి ఉండగా దాడి చేసి బియ్యంతోపాటు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఆటో డ్రైవర్ బాబ్‌జాన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

నిధుల దుర్వినియోగం కేసులో ఒకరి సస్పెన్షన్

నందలూరు, ఫిబ్రవరి 9: నందలూరు మండలం నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై ఒకరిని సస్పెండ్ చేయగా మరొకరికి షోకాజ్ నోటీసు అందజేశారు. ఉన్నతాధికారులకు అందిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేసిన అధికారులు 1,75లక్షల రూపాయల పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశాడంటూ బిల్ కలెక్టర్ పొలిచెర్ల నరసింహులును సస్పెండ్ చేశారు. జీతాల పేరుతో గోల్‌మాల్ చేశాడంటూ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ కాకమూరి నరసింహులుకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. ఈ మేరకు డీపీవో ధనలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేసినట్లు పంచాయతీ సెక్రటరీ హరి నారాయణ తెలిపారు.

ప్రైవేటు ట్రావెల్స్‌లో జీఎస్‌టీ అధికారుల సోదాలు



ప్రైవేటుట్రావెల్స్‌లో తనిఖీచేస్తున్న జీఎస్టీ అధికారులు

ప్రొద్దుటూరు, ఫిబ్రవరి 9 : ప్రొద్దుటూరు లోని ప్రైవేటు ట్రావెల్ కార్యాలయాలపై జీఎస్టీ అధికారులు శుక్రవారం సోదాలు నిర్వహించారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని వాసవి ట్రావెల్స్ లో ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే పార్శిళ్లను పరిశీలించారు. వాటికి సరైన బిల్లులు వున్నది లేనిది విచారించారు. ప్రైవేటు ట్రావెల్స్‌లో నగదు రవాణా జరుగుతోందా అనే కోణంలో సైతం కూడా ఆరా తీశారు.

ప్రాంతీయ పార్టీలు బీజేపీకి బానిసలు : తులసిరెడ్డి

వేంపల్లె, ఫిబ్రవరి 9: రాష్ట్రానికి చెందిన ప్రాంతీయ పార్టీలు బీజేపీకి బానిసలుగా మారాయని ఏపీ కాంగ్రెస్‌మీడియా చైర్మన్ నర్రెడ్డి తులసిరెడ్డి విమర్శించారు. శుక్రవారం వేంపల్లెలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ, టీడీపీ, జనసేనలు బీజేపీ చేతిలో కీలుబొమ్మలుగా మారడం శోచనీయమన్నారు. బీజేపీ రాష్ట్రానికి నెంబర్ 1 ద్రోహి అని అన్నారు. విభజన హామీలు నెరవేర్చకుండా అన్యాయం చేసిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని అమ్మాలని చూస్తోందన్నారు. అటువంటి బీజేపీ ప్రాపకం కోసం ప్రాంతీయ పార్టీలు పాకులాడడం గర్హనీయమన్నారు. బీజేపీలో బీ అంటు బాబు, జే అంటే జగన్, పీ అంటే పవన్‌గా తయారయ్యాయని ఎద్దేవా చేశారు. రాబోవు ఎన్నికల్లో దుష్టచతుష్టయ పార్టీలను ఓడించి కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వేతనాలుపెంచాలని పనిభారం తగ్గించాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని ఆశా కార్యకర్తలు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే వారిపై వైసీపీ ప్రభుత్వం దుశ్శాసన పర్వం కొనసాగించడం దారుణమన్నారు.

గ్రాస్‌ల్యాండ్ కథ కంచికేనా?

● ప్రైవేటు వాహనాలకు పార్కింగ్‌గా మారిన స్థలం ● పట్టించుకోని పాలకులు, మున్సిపల్ అధికారులు



ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారిన గ్రాస్‌ల్యాండ్ స్థలం



2018లో ఆక్రమణలు తొలగించి వేసిన కంచె

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 9: పట్టణం మధ్యలోని గ్రాస్ ల్యాండు ఏడేళ్లైనా అభివృద్ధికి నోచుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాయచోటి మున్సిపాలిటీ పరిధిలోని ఎస్ఎన్‌కాలనీలో జాతీయ రహదారికి పక్కన సుమారు అర్థ కిలోమీటరు పొడవునా గత 40 ఏళ్లుగా పలువురు దుకాణాలు నిర్వహించేవారు. వారి నుంచి ఆ కాలనీకి చెందిన పలువురు అద్దె వసూలు చేసుకునేవారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించాలన్న లక్ష్యంతో 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం గ్రాస్‌ల్యాండ్‌లో ఉన్న అక్రమ నిర్మాణాలను, దుకాణాలను పూర్తి స్థాయిలో తొలగించి చుట్టూ కంచె ఏర్పాటు చేసింది. ఈ వ్యవహారం కొంత ఉద్రిక్త పరిస్థితులకు కూడా దారి తీసింది. అయితే, ఆక్రమణలు తొలగించి ఏడేళ్లు పూర్తవుతున్నా అ స్థలం అభివృద్ధికి నోచుకోలేదు. వైసీపీ ప్రభుత్వం ఏర్పడి ఐదేళ్లు పూర్తి కావస్తున్నా, ఆ పార్టీ పెద్దలు గ్రాస్ ల్యాండ్ అభివృద్ధిని గాలికి వదిలేసి, పట్టణ ప్రజలకు అందుబాటులో లేని ప్రాంతాల్లో అభివృద్ధి చేస్తున్నామని చెబుతున్నారు. అందరికీ అందుబాటులో ఉన్న గ్రాస్‌ల్యాండ్ స్థలాన్ని అభివృద్ధి చేసి పార్కు ఏర్పాటు చేస్తే పట్టణ ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుబాటులోకి వస్తుందని స్థానికులు చెబుతున్నా అధికార పార్టీ నేతలు పట్టించుకోవడం లేదు. ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారిన గ్రాస్ ల్యాండ్ స్థలాన్ని గాలికి వదిలేసి, డైట్ హాస్టల్ ఆక్రమించి అభివృద్ధి చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీ నాయకులు ఓట్ల కోసం ప్లాట్లు వేస్తున్నారా.. లేక ఎస్ఎన్‌కాలనీలోని తమ అనుచర వర్గానికి ఆ స్థలాన్ని అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.. చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్న తమ కడుపులు కొట్టి ఏడేళ్లు గడుస్తున్నా ఇంతవరకు అక్కడ ఎటువంటి పనులు చేపట్టకపోవడంపై దుకాణదారులు, వ్యాపారులు పెదవి విరుస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు గ్రాస్ ల్యాండ్ స్థలం అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా కేంద్రం ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావును వివరణ కోరగా తాను ఈ మధ్యనే బాధ్యతలు స్వీకరించానని, . గ్రాస్‌ల్యాండ్‌ను ఏడేళ్లుగా ఎందుకు అభివృద్ధి చేయలేదో తమ సిబ్బందిని అడిగి తెలుసుకుంటానని, అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకుంటానని తెలిపారు.

ముస్లింలంతా టీడీపీ వెంటే..!

● 40 కుటుంబాలు టీడీపీలో చేరిక ● బీటెక్ రవి



బీటెక్ రవి, మునిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరుతున్న ముస్లింలు

వేంపల్లె, ఫిబ్రవరి 9: ముస్లిం మైనార్టీలు ఎప్పుడు టీడీపీ వెంటే ఉన్నారని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి తెలిపారు. వేంపల్లెలోని నేదరవీధిలో సుమారు 40 ముస్లిం కుటుంబాలు శుక్రవారం సాయంత్రం టీడీపీలో చేరాయి. మండల టీడీపీ అధ్యక్షుడు రామమునిరెడ్డి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఆధ్వర్యంలో ఆయన కండువా వేసి వారిని టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఢిల్లీ పెద్దలతో చంద్రబాబు మాట్లాడితే తప్పేంటని వైసీపీ నేతలను ప్రశ్నించారు. బీజేపీతో సంబంధాలు ఉన్నాయని, మైనార్టీలను టీడీపీ విస్మరిస్తోందని దుష్ప్రచారం చేయడం హాస్యాస్పదమన్నారు. రంజాన్ తోఫా, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా రుణాలు, హజ్ యాత్ర, దుల్హన్ పథకం, విదేశీ విద్య, షాదీఖానా నిర్మాణాలు వంటి ఎన్నోపథకాలు టీడీపీ అమలు చేసిందన్న విషయం ముస్లిం మైనార్టీలు గుర్తుపెట్టుకున్నారన్నారు. వేంపల్లెలో టీడీపీలో ముస్లింలు చేరడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇసుక, మద్యం, రోడ్డు పనుల్లో అవినీతితో డబ్బును సేకరించుకున్న పులివెందుల నాయకులు డబ్బులు పంచుతూ, ఎవరూ పార్టీ నుంచి బయటకు వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారని విమర్శించారు. అభద్రతా భావంతోనే డబ్బుల పంపిణీకి వారు తెరతీశారని విమర్శించారు. వైసీపీ పతనానికి సతీష్‌రెడ్డి అభిమానులు, బంధువులు, మిత్రులు, టీడీపీ శ్రేయోభిలాషులు కలిసిరావాలని విజ్ఞప్తి చేశారు. అందరినీ కలుపుకొని పార్టీ పటిష్టతకు కృషి చేయాలని, రాబోయేది టీడీపీ ప్రభుత్వమేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకుడు షబ్బీర్, జిల్లా వక్ఫ్‌బోర్డు మాజీ డైరెక్టర్ దర్బార్, జయచంద్రారెడ్డి, డివి సుబ్బారెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆర్వీ రమేష్, మండల ఉపాధ్యక్షుడు భద్ర, మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, జిల్లా ఉపాధ్యక్షులు రామగంగిరెడ్డి, గండి మాజీచైర్మన్ రాజారావు, బీసీ నాయకులు మడకా శ్రీనివాసులు, నామా వేమకుమార్ పాల్గొన్నారు.

రాజీవ్ కాలనీలో డీకేటీ పట్టాల దందా..

● ఆర్డీవోకు స్థానికుల ఫిర్యాదు



జమ్మలమడుగు ఆర్డీవో కార్యాలయం వద్దకు బాధితులు

జమ్మలమడుగు, ఫిబ్రవరి 9: పట్టణంలో డీకేటీ పట్టాలను చౌకగా విక్రయిస్తున్నారన్న ప్రచారం నేపథ్యంలో శుక్రవారం గూడెం చెరువు, రాజీవ్ నగర్ కాలనీతోపాటు పట్టణానికి చెందిన పలువురు ఈ మేరకు ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని ఆర్డీవోకు వినతిపత్రం అందజేశారు. గుంతల్లోని చౌడేశ్వరి ఆలయం పక్క ఉన్న స్థలాలను రెవెన్యూ అధికారుల సహకారంతో కొందరు ఆక్రమించుకున్నారని, ఆలయానికి కేటాయించిన 29 సెంట్ల భూమిని సైతం ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని వారు ఆరోపించారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు సైతం సిద్ధం చేసుకున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. బదిలీపై వెళ్లిన అధికారుల సాయంతో కొందరు డీకేటీ పట్టాలపై సంతకాలు చేయించుకుని విక్రయిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పట్టణానికి చెందిన కొందరు ఇప్పటికే జమ్మలమడుగు రెవెన్యూ కార్యాలయంలో పని చేస్తున్నవారితో కలిసి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చెల్లించి పట్టాలు పొందినట్లు సమాచారం. ఈ విషయంలో ఓ బాధితుడు ఇప్పటికే రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. జమ్మలమడుగు పట్టణానికి చెందిన నలుగురు వ్యక్తుల వద్ద గూడెం చెరువుకు సంబంధించిన డీకేటీ పట్టాలున్నట్లుగా తెలుస్తోంది. ఈ విషయంపై జమ్మలమడుగు ఆర్డీవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఈ విషయంపై అధికారులు పరిశీలించి చర్యలు తీసుకుంటారని తెలిపారు. జమ్మలమడుగు డిప్యూటీ తహసీల్దారు వేణుగోపాల్ మాట్లాడుతూ పట్టా ఒరిజినల్ అయితే సంబంధిత వ్యక్తికి సమస్య ఉండదని, గతంలో పనిచేసిన రెవెన్యూ అధికారుల పేర్లు చెప్పి దళారులు విక్రయించే పట్టాలు చెల్లవని స్పష్టం చేశారు. ఫేక్ పట్టాలను గుర్తించామన్నారు. వాటిని విక్రయించేవారిని ప్రజలు నమ్మరాదని తెలిపారు.

ఫ్లెక్సీల చించివేతపై జనసేన నేతల ఫిర్యాదు



ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న జనసేన టీడీపీ నాయకులు

పెనగలూరు, ఫిబ్రవరి 9: మేమూ సిద్ధమే అన్న నినాదంతో మండలంలోని పలు ప్రాంతాలలో జనసేన నేతలు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేసిన వారిపై చర్యలు చేపట్టాలని జనసేన, టీడీపీ నేతలు గురువారం పెనగలూరు ఎస్ఐకి ఫిర్యాదు చేశారు. నారాయణ నెల్లూరు నుంచి మండల కేంద్రం వరకు ఏడు చోట్ల తాము ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో రెచ్చగొట్టే వ్యాఖ్యాలు గానీ, మనోభావాలు దెబ్బతీసే పదాలుగానీ లేవని తెలిపారు. జనసేన పార్టీ ఎదుగుదల, మా నాయకుడి ఉన్నతిని ఓర్చుకోలేని వారే ఈ పని చేసి ఉంటారని తెలిపారు. జనసేన నాయకులు గొబ్బూరి హరిబాబు, నవీన్, సాయికుమార్, హరిప్రసాద్, శ్రీను, చక్రి, శివ, శ్రావణ్, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొత్త బాలకృష్ణ, తెలుగు యువత జిల్లా కార్య దర్శి ఎన్.రాంప్రసాద్ నాయుడు, రాష్ట్ర మైనారిటీ కార్యదర్శి షామీర్, నియోజకవర్గ కార్యనిర్వాహక కార్యదర్శి టి.ధనయ్య, జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు ఎస్.మురళీ సీనియర్ నాయకులు వి.హరిప్రసాద్‌రెడ్డి, జేసీ సుబ్బయ్య, డాక్టర్ తులసి రామకృష్ణయ్య, తాళ్ల సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. ఇదిఇలా ఉండగా శుక్రవారం ఉదయం 7 గంటలకు చించివేసిన ఫ్లెక్సీల స్థానంలో జనసేన నాయకులు మళ్లీ అవే ఫ్లెక్సీలను ఏర్పాటు చేయగా 11 గంటలకల్లా సింగనమల, ఓబిలి, నారాయణ నెల్లూరుల వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మళ్లీ చించి వేశారని. రెండవ దఫా కూడా ఫిర్యాదు చేశారు. .

పిచ్చికుక్కల స్వైర విహారం

● 30 మందికి గాయాలు



ఆస్పత్రిలో కుక్క కాటు బాధితులు

బద్వేలు టౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలో పిచ్చి కుక్కలు స్వైర విహారం చేశాయి. శుక్రవారం ఒక్కరోజే మున్సిపాలిటీ పరిధిలోని పలు వీధుల్లో పిచ్చికుక్కలు దాడి చేసి 30 మందిని గాయపరిచాయి. వీరందరినీ హుటాహుటిన స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణంలోని శివానగర్, వెంకటయ్యనగర్, మహబూబ్‌నగర్, సుమిత్రానగర్, భావ నారాయణనగర్, గాంధీనగర్, శివరామక్రిష్ణానగర్, తెలుగుంగ రోడ్డు, శ్రీనివాసపురం, విద్యానగర్, మార్తోమనగర్, సాయినగర్, నూర్‌బాష్‌కాలనీ, పూసలవాడ, సురేంద్రనగర్ తదితర డివిజన్‌లలో పిచ్చికుక్కల స్వైర విహారం చేశాయి. ఈ దాడిలో వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, గురప్ప, బాలయ్య, రవి, సిద్దార్థ జాన్‌కేడీ, పట్టాభి, శ్రీనివాసులు, దస్తగిరి, షేక్ అహ్మద్, సురేష్, పర్వాణాతో పాటు మరికొంత మందికి తీవ్ర గాయాలయ్యాయి. వీరం దరూ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇటీవల కుక్కల దాడులతో ప్రజలు బయటికి రావాలంటేనే బెంబేలెత్తుతున్నారు. కుక్కల బెడదపై అనేకసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల బారి నుంచి కాపాడాలని కోరుతున్నారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకండి

● డీఈవో మారెడ్డి అనూరాధ

పులివెందుల రూరల్, ఫిబ్రవరి 9: ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు హాజరుకావాలని జిల్లా విద్యాశాఖాధికారి మారెడ్డి అనూరాధ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం పట్టణంలోని జిల్లా పరిషత్ (రవణప్ప సత్రం) ఉన్నత పాఠశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లను డీఈఓ సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. భయాందోళనలు వీడి, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సకాలంలో సిలబస్‌ను పూర్తిచేసుకోవాలని సూచించారు. ఏకాగ్రత పెంచుకునేందుకు ఉదయాన్నే యోగా చేయాలని సలహా ఇచ్చారు. అనంతరం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పరీక్షలంటే భయం ఎందుకు.. విజయం నీదే అవగాహన కరపత్రాలు, ఆత్మహత్యారహిత సమాజంకోసం ప్రతిజ్ఞ చేద్దాం అనే పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్) ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాసరెడ్డి, ఇస్లాంపురం ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, జేవీవీ నాయకులు సనావుల్లా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదవాలి



మాట్లాడుతున్న జడ్జి బాబాఫక్రుద్దీన్

కడప(రూరల్) ఫిబ్రవరి9 : విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు తేవాలని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ బాబాఫక్రుద్దీన్ సూచించారు. శుక్రవారం నగరంలోని మెయిన్ మున్సిపల్ హైస్కూల్‌లో బాండెడ్ లేబర్ నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ 1976లో భారతదేశంలో బాండెడ్ లేబర్ సిస్టమ్‌ను రద్దుచేయడానికి ది బాండెడ్ లేబర్ సిస్టమ్ అబాలిషన్ యాక్ట్ 1976 రూపొందించారన్నారు. వెట్టిచాకిరి నిర్మూలన, నిర్బంధ ఉచిత విద్య, చైల్డ్ లైన్ టోల్‌ఫ్రీ నెంబర్ 1098, 15100, చైల్డ్ రైట్స్, ప్రాథమిక హక్కులు, విధులు తదితర అంశాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొహిబిషన్ జిల్లా అధికారి జి. చెన్నారెడ్డి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వి.వి. సాంబశివరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతు ప్రయోజనాలే డీసీసీబీ లక్ష్యం



మెమెంటోలను అందజేస్తున్న డీసీసీబీ చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

కడప(రూరల్) ఫిబ్రవరి : రైతు ప్రయోజనాలే డీసీసీబీ లక్ష్యమని ఆ బ్యాంకు చైర్‌పర్సన్ ఝాన్సీరాణి తెలిపారు. కడప జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ 106వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం కడపలోని ఆ సంస్థ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా రైతుల ప్రయోజనాలకు సహకార రంగంలో ఏర్పడిన తొలి బ్యాంకు కడప డీసీసీ బ్యాంకు అన్నారు. బ్యాంకు ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఉమ్మడి కడప జిల్లాలోని రైతులకు కావలసిన అన్ని రుణాలను అందిస్తున్నామన్నారు. అనంతరం కరెంటు, సేవింగ్స్ డిపాజిట్లు, టర్మ్ డిపాజిట్లలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన అధికారులు, ఉద్యోగులకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్ఏ దుర్మరణం

● ముగ్గురికి తీవ్రగాయాలు



వీఆర్ఏ మృతదేహం

రామాపురం, ఫిబ్రవరి 9: రెండు స్కూటర్లు ఢీకొనడంతో కల్పనాయుని చెరువు వీఆర్ఏ తొట్టి సుబ్బరాయుడు (70) దుర్మరణంపాలు కాగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. రామాపురం మండలం కల్పనాయునిచెరువుకు చెందిన వీఆర్ఏ తొట్టిసుబ్బరాయుడు ఇంటి నుంచి నేదరపల్లి వైపు వెళుతుండగా, నేదరపల్లి నుంచి నీలకంఠ్రావుపేట వెళుతున్న స్కూటర్ ఢీకొంది. ఈ సంఘటనలో తొట్టి సుబ్బరాయుడు అక్కడికక్కడే మృతి చెందగా, మరో స్కూటర్‌పై ప్రయాణిస్తున్న తొట్టి సత్యనారాయణ, ఆయన భార్య వాణి, కుమారుడు శ్రీనివాసులు తీవ్రంగా గాయపడ్డారు. రామాపురం పోలీసులు గాయపడిన వారిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. గాయపడినవారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎల్ వీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

కాశినాయన ఫిబ్రవరి 9: మండలంలోని బాలాయపల్లెకు చెందిన పి. వెంకటయ్య నుంచి 30 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు కాశినాయన మండల ఎస్ఐ అమర్‌నాథ్ రెడ్డి తెలిపారు.కొంతకాలంగా వెంకటయ్య గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో నిఘా పెట్టి శుక్రవారం పట్టుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మైదుకూరు : మద్యం సీసాలు తీసుకెళ్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఐ రాజరాజేశ్వరరెడ్డి కథనం మేరకు ఓ వ్యక్తి అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో, శుక్రవారం పట్టణంలోని తనిఖీలు చేస్తుండగా ఖాజాపీర్ అనే వ్యక్తి మద్యం సీసాలు తీసుకెళుతూ పట్టుబడ్డాడన్నారు. అతని నుంచి 53 బాటిళ్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని వరిగ పాపిరెడ్డిగారిపల్లె గ్రామ పంచాయతీ చౌటచెరువు సమీపంలో నారాయణ (53) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చౌటచెరువుకు చెందిన నారాయణ ప్రతిరోజు మద్యం సేవిస్తూ తిరిగేవాడు. గురువారం మద్యం సేవించేందుకు రాయచోటి పట్టణానికి వచ్చిన నారాయణ తిరిగి ఇంటికి వెళ్లలేదు. దీంతో అతని భార్య భారతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అయితే శుక్రవారం గ్రామానికి సమీపంలోని పొలాల్లో నారాయణ మృతి చెంది పడి ఉండడాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేశారు. మృతదేహాన్ని రాయచోటి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి కడప- పామూరు బస్సు సర్వీసు

మైదుకూరు, ఫిబ్రవరి 9: కడప రైల్వేస్టేషన్‌లో బొంబాయి - చెన్నై రైలుకు లింకుగా కడప - పామూరు బస్సు సర్వీసు ప్రారంభిస్తున్నట్లు డీఎం శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు మైదుకూరు నుంచి ఉదయం 4.45 గంటలకు బయలు దేరి రైలు వచ్చే సమయం ఉదయం 5.50లోగా కడప రైల్వే స్టేషన్‌కు చేరుతుందని, అక్కడి నుంచి 6 గంటలకు బయలు దేరి మైదుకూరు, పోరుమామిళ్ళ, సీతానగరం మీదుగా ఉదయం11.10 గంటలకు పామూరుకు చేరుకుంటుందని తెలిపారు. 11-30కి పామూరులో బయలు దేరి సాయంత్రం 5 గంటలకు కడప రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుందని వివరించారు. చెన్నై నుంచి బొంబాయికి వెళ్లే రైలు ప్రయాణికులకు సౌకర్యంగా ఉంటుందని, అలాగే రైల్వే స్టేషన్‌కు వెళ్ళే ప్రయాణికులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

చిట్వేలి, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని చిట్వేలి, భాకరాపురం, కస్తూరివారిపల్లె, పత్తిగుంటవారిపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 2గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని చిట్వేలి ట్రాన్స్‌కో ఏఈ వెంకటాచలపతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు రెండవ శనివారం సందర్భంగా రాజంపేట 220 కేవీ మరమ్మతుల కారణంగా చిట్వేలి మండల పరిధిలోని 33 కేవీ సబ్‌స్టేషన్‌లో విద్యుత్ సరఫరాలలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా ఏఈ వెంకటాచలపతి కోరారు.

ఆలయాల్లో చోరీ



ఆలయ సమీపంలో పగులగొట్టిన హుండీ

సంబేపల్లె, ఫిబ్రవరి 9: మండలంలోని శెట్టిపల్లె గ్రామం గాండ్లపల్లె పాగేటి గంగమ్మ ఆలయం, కొత్తపల్లె బిడికి నాగాపురం ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ఆలయ నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. చోరీ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పోలీసులు ఆలయాలను సందర్శించి చోరీ సంఘటనపై ఆరా తీశారు. పాగేటి గంగమ్మ ఆలయం సమీపంలో హుండీ పగులగొట్టి అందులో సుమారు రూ.30 వేలు తీసుకెళ్లినట్లు ఆలయ నిర్వాహణాధికారి తెలిపారు. ఎస్‌ఐ రామకృష్ణ ఆలయాల్లో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించి త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు.

ధరలేని ఉజాలా వంగ

- కేజీ రూ.20
- సంబేపల్లె టు చెన్నై మార్కెట్‌కు తరలింపు
- తెగుళ్లతో రైతులు లబోదిబో



సాగులో ఉన్న వంగ తోట



చెన్నై మార్కెట్‌కు తరలించేందుకు సిద్ధం చేస్తున్న బస్తాలు

సంబేపల్లె, ఫిబ్రవరి 9: కరువు జిల్లాలో వ్యవసాయం రైతులకు భారంగా మారుతోంది. ప్రకృతి విపత్తులతో పంట సాగుకు ఖర్చు చేసిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితులు ఉన్నాయి. పంట ఏదో ఒక దశలో నష్టం రావడంతో కష్టాలు, అప్పులు ఎదుర్కొంటున్న రైతులు ప్రత్యామ్నాయంగా కూరగాయ సాగుల వైపు పడ్డారు. ఈ క్రమంలో టమోటా సాగుతో పాటు వంగసాగు వైపు మక్కువ చూపడం విశేషం. చెన్నై మార్కెట్‌లో సాంబారు రకం ఉజాల వంగకు మంచి గిరాకీ ఉండటంతో ఈ రకం సాగు చేపట్టారు. నిలకడ లేని ధరలతో పెట్టిన పెట్టుబడులు రాక రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం ఉజాల వంగ చెన్నై మార్కెట్‌లో కేజీ రూ.20 ధర ఉండడంతో రైతులు నిరాశ చెందుతున్నారు. మండలంలో 50 ఎకరాల్లో రైతులు ఈ పంటను సాగు చేశారు.

రూ.కేజీ 40 ఉంటే తప్ప లాభం రాదు

- రమేశ్, రైతు, అడవికమ్మపల్లె



ఉజాల రకం వంగ ఒకటిన్నర ఎకరా సాగు చేపట్టాను. సుమారు రూ.80 వేల నుంచి రూ.లక్ష ఖర్చు చేశాను. వారానికి ఒక కోత వస్తుంది 80 కేజీల బస్తా రూ.250 నుంచి 350 వరకు చెల్లించి చెన్నై మార్కెట్‌కు తరలిస్తున్నా. వంకాయ ధర రూ.20 ఉంది. ప్రకృతి విపత్తుతో పూత, పింజ పట్టడం లేదు. కేజీ 40 రూపాయలు ధర ఉంటే తప్ప లాభం రావడం కష్టం.

వంగకు తెగుళ్లు ఎక్కువ

- దేవేంద్ర, నరసారెడ్డిగారిపల్లె



వంకాయపై వచ్చిన తెగులు

వర్షపు పరిస్థితుల కారణంగా తెగుళ్లు విపరీతమయ్యాయి. ధర చూస్తే 20 నుంచి 25 లోపు ఉంది. వారానికి ఒకసారి ఎకరాకు 5 నుంచి 6 రూపాయలు మందులు పిచియారి చేయాలి. ధర లేని వంగకు తెగుళ్లు ఎక్కువయ్యాయి. ఇలా అయితే పెట్టిన పెట్టుబడి రాక నష్టపోక తప్పదు.

జనసేన సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలి

వీరబల్లి, ఫిబ్రవరి 9: జనసేన పార్టీ సిద్ధాంతాలను, పవన్ కల్యాణ్ ఆశయాలను ప్రతి గడపకు తీసుకెళ్లి వివరించాలని రాజంపేట అసెంబ్లీ పార్లమెంట్ జనసేన పార్టీ నాయకుడు రామశ్రీనివాస్ పేర్కొన్నారు. జనంలోకి జనసేన కార్యక్రమంలో భాగంగా జనసేన నేత శ్రీనివాస రాజు ఆదేశాల మేరకు ఆయన శుక్రవారం మండల పరిధిలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీలో జనంలోకి జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జనసేన అధినాయకత్వాన్ని గుర్తించి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు దినేశ్, పవన్, సురేశ్, నగేశ్, నరసింహులు, శివనంద్ తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతను నివారిద్దాం

సంబేపల్లె, ఫిబ్రవరి 9: విద్యార్థుల్లో రక్తహీనతను నివారిద్దామని, వాటి నివారణ కొరకు అల్బెండజోల్ మాత్రలు వాడాలని సంబేపల్లె వైద్యాధికారి సూర్యనారాయణరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని పెద్ద జంగంపల్లె జడ్పీ హైస్కూల్‌లో జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో రక్తహీనతను నియంత్రించడానికి, వ్యాధి నిరోధకతను మెరుగుపర్చడానికి అల్బెండజోల్ మాత్రలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. స్థానిక జిల్లా హైస్కూల్‌లో 564 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు చక్రపాణి, హెల్త్ అసిస్టెంట్ రవిశంకర్, హెల్త్ సూపర్‌వైజర్ వరలక్ష్మి, ఆశావర్కర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మండిపల్లిని కలిసిన మైనార్టీ, బీసీ నేతలు



మండిపల్లిని కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న మైనార్టీ, బీసీ నేతలు

రాయచోటిటౌన్,ఫిబ్రవరి 9: పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీలో గల టీడీపీ కార్యాలయంలో రాయచోటి నియోజకవర్గంలోని లక్కిరెడ్డిపల్లె, గాలివీడు, రాయచోటి మండలాలకు చెందిన పలువురు మైనార్టీ నేతలు, బీసీ నేతలు నియోజకవర్గ టీడీపీ యువనాయకుడు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. పూలబొకేలతో, గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు ఆయా మండలాల్లో ప్రస్తుతం కొనసాగుతున్న రాజకీయ పరిస్థితులపై ఆయనతో చర్చించారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఆయా మండలాల్లోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు రాబోయే రోజుల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేయాలని, పార్టీ అభ్యర్థుల విజయం కోసం సైనికుల్లా కృషి చేయాలని ఆయన కోరారు.

16న దేశవ్యాప్త బంద్ జయప్రదం చేయండి

- సీఐటీయూ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు

రాయచోటి టౌన్, ఫిబ్రవరి 9: కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 16న జరుగుతున్న దేశవ్యాప్త బంద్ (గ్రామీణ- పారిశ్రామిక బంద్)ను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రలు పిలుపునిచ్చారు. శుక్రవారం వారు స్థానిక సీఐటీయూ కార్యాలయంలో బంద్‌కు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వ రైతాంగం, కార్మిక వర్గ ప్రజల సమస్యలు పరిష్కరించకుండా అచ్చేదిన్, ఆత్మనిర్భర భారత్, మేకిన్ ఇండియా వంటి మోసపూరిత నినాదాలిచ్చినా ఉపయోగం లేదన్నారు. బీజేపీ ప్రభుత్వ విధానాలు రద్దయ్యేంత వరకు జిల్లాలోని రైతు, ఉద్యోగ, కార్మికులు, మహిళలు, విద్యార్థులు ఈ నెల 16న జరిగే దేశవ్యాప్త బంద్ జయప్రదం చేసి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ కార్యకర్తలు భాగ్యలక్ష్మి, అరుణ, సురేఖ, ఇర్షాద్, రమీజా, తహరున్నీషా, లక్ష్మీదేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లే

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 9: పరిశుభ్రతగా ఉంటే ఆరోగ్యంగా ఉన్నట్లే అని రైల్వేకోడూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.నాగరాజు తెలిపారు. శుక్రవారం ప్రపంచ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఈ మాత్రలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.రమేష్, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కార్డుల పంపిణీ

చిన్నమండెం, ఫిబ్రవరి 9: మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో స్వామిత్వ పథకం ద్వారా ఆస్తి కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని సర్పంచ్ ముసల్ రెడ్డితో కలిసి ఈవోపీఆర్డీ పవన్‌కుమార్ ప్రారంభించారు. లబ్ధిదారులకు తమ ఇళ్లను సొంతం చేసుకునే హక్కు చట్టపరమైన పత్రం ఉంటుందని చెప్పారు. దేశాభివృద్ధిలో భూమి, ఇంటి యాజమాన్యం ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. ఆస్తి రికార్డు ఉన్నప్పుడు, పౌరులు విశ్వాసం పొందడంతో పాటు, పెట్టుబడికి కొత్త మార్గాలు తెరుచుకునే అవకాశం ఉంటుందని తెలియజేశారు. గ్రామాల్లో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించడానికి వీలుంటుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సమిత్రమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేస్తాం

- భారత్ దివ్యాంగుల ఉపాధ్యక్షుడు వెంకటరామరాజు

లక్కిరెడ్డిపల్లె, ఫిబ్రవరి 9: వచ్చే ఎన్నికల్లో దివ్యాంగులు అన్ని నియోజకవర్గాలల్లో పోటీ చేస్తామని భారత్ దివ్యాంగుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటరామరాజు పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 77 సంవత్సరాలుగా దివ్యాంగుల పట్ల వివక్షత చూపుతూ వచ్చాయన్నారు. రాష్ట్రంలో వివిధ సంఘాలను కలుపుకొని ఒక పార్టీని బలోపేతం చేస్తామన్నారు. అందుకు ఈ నెల 11న రాయచోటి డైట్ కళాశాలలో జిల్లా దివ్యాంగుల కార్యవర్గం నిర్వహించి ఒక్కో ప్రాంతానికి సంఘం నాయకుడిగా నియమిస్తామన్నారు. ప్రతి నియోజకవర్గంలో పోటీ నిర్వహించి దివ్యాంగుల ఓటు బ్యాంక్‌ను రాజకీయ నాయకులు ఆలోచించేలా చేస్తామన్నారు. దివ్యాంగుల హక్కుల సాధన కోసం ప్రతిఒక్కరూ చేయిచేయి కలపాలని పిలుపునిచ్చారు.

ప్రపంచ దేశాలకు ఆదర్శంగా మోదీ పాలన



చిట్వేలిలో పల్లెకు పోదాం కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్

చిన్నమండెం, ఫిబ్రవరి 9: ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో దేశం అభివృద్ధి, సంక్షేమం వైపు పరుగులు పెడుతోందని, భారతదేశం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలుస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేశ్ అన్నారు. కేంద్ర పార్టీ పిలుపు మేరకు శుక్రవారం మండలంలోని పడమటికోన కస్పాలో సాయిలోకేశ్ ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బీజేపీ నాయకులు గడప గడపకు తిరిగి తొమ్మిదిన్నర సంవత్సరాల్లో మోడీ పాలనలో దేశంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ గురించి ప్రజలకు వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించి గ్రామ స్థాయిలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల అందాలన్న లక్ష్యంతో పల్లకు పోదాం అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పల్లపు నాయుడు, తిరుపతినాయుడు, పురుషోత్తంనాయుడు, అవినాశ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: మండలంలోని బోయనపల్లి, మదనగోపాలపురం గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో శుక్రవారం బీజేపీ జిల్లా కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి పాపయ్య ఆధ్వర్యంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేశ్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పిలుపు మేరకు రాష్ట్రంలోని 21 వేల గ్రామాల్లో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆదినారాయణ, బీజేపీ సీనియర్ నాయకుడు మృగరాజు, రమణయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి జి.కె.నాగరాజు, బీజేపీ పార్లమెంటు నాయకుడు తోట నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నందలూరు: మండలంలోని కుంపినీపురం, మదనమోహనపురం, పొత్తపి గ్రామాల్లో పల్లెకు పోదాం (గావ్ చలో అభియాన్) కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించినట్లు బీజేపీ రాజంపేట అసెంబ్లీ కో-కన్వీనర్ డాక్టర్ అరిగె రాంప్రసాద్ పేర్కొన్నారు. రాజంపేట పార్లమెంటు జిల్లా బీజేపీ ఇన్‌చార్జి, మాజీ కేంద్ర వేర్‌హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రమౌళి ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి, రాంప్రసాదులు మాట్లాడుతూ దేశంలోని నలుమూలల ఉన్న పల్లెల్లో ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్‌రాజు, వీబీ ఎస్‌వై జిల్లా కో-ఆర్డినేటర్ ఆదినారాయణ, మండల యువ మోర్చ అధ్యక్షుడు చుక్కా శ్రీనివాసులు, బీజేపీ మండల కార్యదర్శి మురళి, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్నికల విధులకు సిద్ధంగా ఉండాలి

- నియోజకవర్గ ఎన్నికల అధికారి లీలారాణి



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల అధికారి బి.లీలారాణి

రైల్వేకోడూరు(రూరల్), ఫిబ్రవరి 9: ఎన్నికల అధికారులు తమ విధులకు సిద్ధంగా ఉండాలని రైల్వేకోడూరు నియోజకవర్గ ఎన్నికల అధికారి బి.లీలారాణి తెలిపారు. శుక్రవారం మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో రాజంపేట డీఎస్పీ చైతన్యతో కలిసి నియోజకవర్గ స్థాయి ఐదు మండలాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని పోలీసులకు తెలిపారు. ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు గైర్హాజరు కాకుండా ఉండాలని కోరారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ సీఐ టి.బాబు, రూరల్ సీఐ మధుసూదన్ రెడ్డి, ఐదు మండలాల ఎస్‌ఐలు, రెవెన్యూ సిబ్బంది, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

గారడీలు మానుకోండి: ఏఐఎస్ఏ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 9: గారడీలు చేయడం మానుకొని 10 ఏళ్ల దేశంలోని యువతకు బీజేపీ ప్రభుత్వం ఏం చేసిందో చెప్పాలని ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం రాయచోటి పట్టణంలో యంగ్ ఇండియా రెఫరెండం కార్యక్రమం మూడవ రోజు ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) జిల్లా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విద్యా వ్యతిరేఖ విధానాలపై యంగ్ ఇండియా రెఫరెండం కార్యక్రమం జాతీయ స్థాయిలో అన్ని యూనివర్సిటీల్లో నిర్వహించడం జరుగుతోందన్నారు. బీజేపీ ప్రభుత్వం వచ్చి పదేళ్లు అవుతున్నప్పటికీ దేశంలో నిరుద్యోగం తాండవిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఏ ఏరియా అధ్యక్షుడు రెడ్డి మహేశ్, సంతోశ్, నిరంజన్, దర్బార్, మహమ్మద్, విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో అభ్యసనాభివృద్ధి పెంచుదాం

- రాష్ట్ర పరిశీలకుడు ఉపేంద్రారెడ్డి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు

సంబేపల్లె, ఫిబ్రవరి 9: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాల అభ్యసనాభివృద్ధి పెంచుదామని (లర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం) లిప్ రాష్ట్ర పరిశీలకుడు ఉపేంద్రారెడ్డి తెలిపారు. బుధవారం సంబేపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో అమలవుతున్న అభ్యసనాభివృద్ధి కార్యక్రమాన్ని పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థులకు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు శంకరయ్య చేస్తున్న మాదిరి పాఠ్య బోధనను ఆసక్తిగా గమనించారు. విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల సామర్థ్యాలపై పలు ప్రశ్నలు వేయగా.. వారు సమాధానాలు చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నరసింహారెడ్డి, ఏఎంవో రామకృష్ణ, అసిస్టెంట్ ఏఎంవోలు రామాంజుల్‌రెడ్డి, సమీవుల్లా, డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ రెడ్డెయ్య, ఎంఈవోలు బాలాజీనాయక్, రమాదేవి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మోడీ పాలనలో దేశాభివృద్ధి

సుండుపల్లె, ఫిబ్రవరి 9: ప్రధాని నరేంద్రమోడీ పాలనలో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని టీడీపీ రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామజగదీశ్ తెలిపారు. మండలంలోని సామిసేనిగడ్డలో బీజేపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని శుక్రవారం ప్రజలకు తెలియజేశారు. మునుపెన్నడూ లేని అభివృద్ధి చేయడంలో ప్రధాని విజయం సాధించారన్నారు. బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలపై సంతృప్తిగా ఉన్న లబ్ధిదారులు స్వచ్ఛందంగా 9090902024 నెంబరుకు మిస్డ్‌కాల్ ఇవ్వాలని కోరారు.

ఆల్బెండజోల్‌తో నులిపురుగుల నివారణ

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 9: జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఆరోగ్యవంతమైన పిల్లల కోసం నులిపురుగులను నులిమేద్దామని తెలియజేస్తూ శుక్రవారం మధ్యాహ్నం భోజనానంతరం రాయచోటి మండల పరిధిలోని మాధవరం జడ్పీ ఉన్నత పాఠశాలతో పాటు అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థినీ, విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జడ్పీ ఉన్నత పాఠశాలలో యండపల్లె పీహెచ్‌సీ ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు యర్రపురెడ్డి విశ్వనాధరెడ్డి మాట్లాడుతూ నులిపురుగుల నుంచి రక్షణ పొందేందుకు చేతి గోళ్లను శుభ్రంగా ఉంచుకోవాలని, ఎప్పుడూ శుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పూల వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయులు జమాల్‌బీ, ఆశా కార్యకర్త రెడ్డిరాణి, ఉపాధ్యాయులు వెంకట్రామయ్య, ఏకే మస్తాన్, రమణయ్యనాయక్, వెంకట్రమణ, నాగరాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.

పంట నమోదుకు ఈకేవైసీ తప్పనిసరి

సంబేపల్లె, ఫిబ్రవరి 9: రైతులు సాగు చేసిన పంటల నమోదుతో పాటు ఈకేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా జేడీఏ చంద్రానాయక్ తెలిపారు. సంబేపల్లె వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ సలహా మండలి సభ్యుల సమక్షంలో సమావేశం నిర్వహించారు. రైతులు సకాలంలో పంట నమోదు చేసుకోవడం ద్వారా క్రాప్ ఇన్సూరెన్స్, పంట నష్టపరిహారం, క్లాప్‌లోన్స్, పీయం కిసాన్, రైతు భరోసా వంటివి వరిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ వ్యవసాయాధికారి వెంకటమోహన్, మండల వ్యవసాయ అధికారి కిశోర్‌నాయక్, ఏఈవోలు రెడ్డివెంకట్రమణ, రేణుక, సలహా కమిటీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

సిద్దవటం, ఫిబ్రవరి 9: కడప-చెన్నై రహదారి భాకరాపేట పోలీసు చెక్‌పోస్టు వద్ద సిద్దవటం ఎస్‌ఐ పెద్దఓబన్న వాహనాల తనిఖీ నిర్వహించారు. రానున్న ఎన్నికల దృష్ట్యా నగదు, బంగారం తరలివెళ్లకుండా తనిఖీ చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా వాహనపత్రాలు, లైసెన్సులు ఖచ్చితంగా ఉండాలని వాహనదారులకు తెలియజేశారు.

టీడీపీ నేతకు చమర్తి పరామర్శ



శివకుమార్‌నాయుడును పరామర్శిస్తున్న జగన్‌మోహన్‌రాజు

సుండుపల్లె, ఫిబ్రవరి 9: రాష్ట్ర వాణిజ్య విభాగపు అధికార ప్రతినిధి, సుండుపల్లె మండల సీనియర్ టీడీపీ నాయకుడు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి శివకుమార్‌నాయుడును రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పరామర్శించారు. వ్యవసాయ పనుల్లో భాగంగా శివకుమార్‌నాయుడుకు నాలుగు రోజుల క్రితం గాయమై శస్త్ర చికిత్స చేయించుకొన్నారు. ఈ విషయాన్ని జగన్‌మోహన్‌రాజు తన అనుచరుల ద్వారా తెలుసుకుని శుక్రవారం సాయంత్రం తిమ్మసముద్రం ఆలయాల సమీపంలోని శివకుమార్‌నాయుడు ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈయన వెంట టీడీపీ నాయకులు, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబు, శివరాంనాయుడు, చంద్రమౌళి, చంద్రశేఖర్, ఎల్‌వీ రమణ, నాగార్జున, పురుషోత్తం పాల్గొన్నారు.

ఆక్రమణలపై తహశీల్దారు విచారణ



విచారణ చేపడుతున్న తహశీల్దారు

పుల్లంపేట, ఫిబ్రవరి 9: మండల పరిధిలోని దొండ్లోపల్లె గ్రామంలో సర్వేనెంబరు-3లో ఉన్న కొత్తకుంట, దాని పక్కనున్న ప్రభుత్వ భూములు ఆక్రమించడంపై తహశీల్దారు నరసింహ కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. దొండ్లోపల్లె గ్రామస్తులు భూ ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు స్పందనలో అర్జీలు ఇవ్వడంతో ఆయన ఈ సందర్భంగా విచారణ చేపట్టారు. కొత్తకుంట గయ్యాలి భూమి అని, ఆక్రమణలు తొలగిస్తామన్నారు. 7వ విడత భూ పంపిణీలో సర్వే చేయకుండానే పట్టాలు మంజూరు చేయడం వల్ల సమస్య వచ్చిందని, దీన్ని పరిష్కరించేందుకు తిరిగి సర్వే చేపట్టి హద్దులు చూపుతామన్నారు. అలాగే ఆక్రమణలపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ మేరకు కలెక్టర్‌కు నివేదిక పంపనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ నవీన్, వీఆర్వో సోమశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

తహసీల్దార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలి

- సీపీఐ దళిత ప్రజాసంఘాల డిమాండ్



డీఆర్‌వోకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 9: దళిత మహిళలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన రామాపురం తహసీల్దార్ తప్పుడు నివేదికలు ఇచ్చినందుకు ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి వారిని విధుల నుంచి తొలగించి శాఖపరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ డిమాండ్ చేసింది. ఈ విషయంపై బాధిత మహిళలతో కలిసి డీఆర్‌వో సత్యనారాయణకు శుక్రవారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు అబ్బవరం యుగంధర్, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుక్కే విశ్వనాథ, నాయకులు మాట్లాడుతూ దళిత మహిళలకు అన్యాయం చేసిన తహసీల్దార్‌పై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయంపై డీఆర్‌వో స్పందిస్తూ రాయచోటి ఆర్డీవో ద్వారా విచారణ జరిపిస్తామని దళిత మహిళలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాధిత దళిత మహిళలతో పాటు సీపీఐ దళిత ప్రజా సంఘాల నాయకులు పుల్లయ్య, సుధాకర్, పండరయ్య, పెద్దగంగయ్య పాల్గొన్నారు.

గంగులయ్య అంకితభావం గల వ్యక్తి



గంగులయ్య భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న ప్రసాద్‌బాబు

గాలివీడు, ఫిబ్రవరి 9: గంగులయ్య అంకితభావం గల వ్యక్తి అని, టీడీపీ అంటే అభిమానమని టీడీపీ పాలక మండలి మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు కొనియాడారు. గంగయ్య (54) గత కొన్ని రోజులు అనారోగ్యానికి గురై వివిధ పట్టణాల్లో చికిత్స చేయించుకున్నప్పటికీ ఆరోగ్యం క్షీణించి శుక్రవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న ప్రసాద్‌బాబు ఆయన స్వగ్రామమైన గుండ్లచెరువు గ్రామం ఎస్సీ కాలనీకి చేరుకొని ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా రాహుకాల పూజలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 9: పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో శుక్రవారం రాహుకాల పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేద మంత్రాల మధ్య భద్రకాళీ అమ్మవారికి అభిషేకాలు నిర్వహించారు. వివిధ రకాల పుష్పాలు, పట్టువస్త్రాలతో అమ్మవారిని అలంకరించి పూజలను నిర్వహించారు.

కులగణనను వేగవంతం చేయాలి: జేసీ

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: జిల్లాలో రెండు వారాలుగా చేపట్టిన కులగణను వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఆయన తన ఛాంబర్ నుంచి ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో వీడియోకాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. కులగణన ఇప్పటి వరకు 92 శాతం పూర్తి కాగా, ఈనెల 15 స్థానిక విజ్ఞాన సుధ డిగ్రీ కళాశాలలో జరిగే మెగా జాబ్ మేళా ద్వారా ఆరు వేల పోస్టుల భర్తీకి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. డీఆర్వో పులయ్య, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి గుణశేఖర్, డీపీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దేవదాయశాఖ ఏసీగా ప్రసన్నలక్ష్మి బాధ్యతల స్వీకరణ

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 9: చిత్తూరు దేవదాయశాఖ శాఖ అసిస్టెంట్ కమిషనరు (ఏసీ)గా ప్రసన్నలక్ష్మి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీగా పనిచేస్తున్న ఏకాంబరానికి డీసీగా పదోన్నతి అభించింది. ఆయ స్థానంలో కర్నూలు జిల్లాలో గ్రేడ్-1 ఈవో పనిచేస్తున్న ప్రసన్నలక్ష్మిని పదోన్నతిపై నియమించారు. ఈమెను అధికారులు సుమన ప్రియ, వెంకటేశ్వర్లు, శ్వేత, రూప, రాధిక, రవికుమార్ తదితరులు సన్మానించారు.

హైవేరోడ్డు పనుల్లో క్రేన్‌కిందపడి వ్యక్తి మృతి


మృతి చెందిన గులాబ్

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 9: గంగాధరనెల్లూరు మండలం కండిగ వద్ద హైవే పనుల్లో క్రేన్‌కిందపడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. ముక్కళత్తూరు పంచాయతీ కండిగ గ్రామ సమీపంలో చిత్తూరు- తచ్చూరు జాతీయ రహదారి పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగా కార్మికుడు గులాబ్ అలీయాస్ గులా(48) ప్రమాదవశాత్తు క్రేన్ కింద పడ్డారు. ఆయన్ను కాంట్రాక్ట్ సిబ్బంది వెంటనే చిత్తూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారని తెలిపారు. సీఐ శంకర్‌ను శుక్రవారం రాత్రి వివరణ కోరగా హైవే కాంట్రాక్ట్ సిబ్బంది నుంచి తమకు ఇంకా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు. అయితే హైవేపనుల్లో పనిచేసే కార్మికుడు గులాబ్ మృతదేహం మార్చురిలో ఉన్నట్లు చిత్తూరు ఆస్పత్రి నుంచి సమాచారాన్ని అందజేశారన్నారు. ఫిర్యాదు అందితే శనివారం పోస్ట్‌మార్టమ్ చేయిస్తామన్నారు.

విద్యుత్తు తీగలు తెగి ఆగిన రైళ్లు



కుప్పం, ఫిబ్రవరి 9: తమిళనాడు రాష్ట్రం జోలార్‌పేట రైల్వే స్టేషన్ సమీపంలో రైల్వేకు సంబంధించిన విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో చెన్నై-బెంగళూరు మార్గంలో నడుస్తున్న రైళ్లు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. బెంగళూరు నుంచి కొచ్చివెల్లి వెళ్లే రైలు కుప్పం స్టేషన్లో ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడ్డారు.

రేపు సీసీఎల్ టీ20 క్రికెట్ సెలక్షన్స్

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 9: చిత్తూరు క్రికెట్ లీగ్(సీసీఎల్) టీ20 సెలక్షన్స్ ఆదివారం నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా బాయ్స్ అండ్ గర్ల్స్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతిలో తుమ్మలగుంట మైదానం, చిత్తూరులో పోలీస్ పరేడ్ గ్రౌండ్, మదనపల్లిలో మాస్టర్‌మైండ్ స్కూల్ ఎదురుగా ఉన్న మైదానంలో ఎంపిక ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. 1994 సెప్టెంబరు 1 నుంచి 2008 సెప్టెంబరు 1న మధ్య జన్మించిన వారు అర్హులని, ఆసక్తిగలవారు తెల్లని దుస్తులు, క్రీడా సామగ్రితో హాజరుకావాలని వివరించారు. మరింత సమాచారం కోసం 9849026131(తిరుపతి), 9014440543(చిత్తూరు), 7013031459(మదనపల్లె)లను సంప్రదించాలని కోరారు.

పీవీకి 'భారతరత్న' ఇవ్వడం హర్షణీయం


పీవీ పక్కన చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ హోదాలో చిన్నస్వామి (ఫైల్‌ఫొటో)

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 9: మాజీ ప్రధానమంత్రి, దివంగత పి.వి.నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్నను ప్రకటించడం చాలా సంతోషకరంగా ఉందని ప్రధానమంత్రి రిటైర్డ్ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పి.చిన్నస్వామి పేర్కొన్నారు. గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ గోవింద రెడ్డిపల్లెకు చెందిన ఈయన శుక్రవారం మాట్లాడారు. ప్రధానమంత్రిగా పేరు ప్రఖ్యాతులు గడించిన పి.వి.నరసింహారావు వద్ద తాను సెక్యూరిటీ ఆఫీసర్‌గా పనిచేయడం గర్వకారణంగా ఉందన్నారు. ఆర్థికవేత్త, బహుభాషా కోవిదుడు, రాజనీతిజ్ఞుడు, తెలుగువారైన నరసింహారావుకు అత్యున్నత పురస్కారం రావడం గర్వించదగ్గ విషయమన్నారు.

డ్వాక్రా గ్రూపులో రూ.4 లక్షల స్వాహా

కలెక్టర్‌కు సభ్యుల ఫిర్యాదు

సోమల, ఫిబ్రవరి 9: పెద్దమ్మ తల్లి వెలుగు గ్రూపులో సభ్యులకు తెలియకుండా ఓ సభ్యురాలు రూ.4లక్షలు మేరకు స్వాహా చేసిందని ఆ సంఘ సభ్యులు శుక్రవారం కలెక్టర్ షన్మోహన్‌కు ఫిర్యాదు చేశారు. సోమల హైస్కూల్‌లో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేతులమీదుగా ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్ షన్మోహన్ పాల్గొన్నారు. సభానంతరం ప్రజల నుంచి మంత్రి వినతులు స్వీకరించారు. సోమల మండలం భారతంమిట్టకు చెందిన పెద్దమ్మ తల్లి డ్వాక్రా సంఘంలో 10 మంది సభ్యులున్నారు. వారు నిరక్షరాసులు కావడంతో వీరిలో ఓ సభ్యురాలు పుస్తక నిర్వహణ, బ్యాంకు లావాదేవీ చేస్తూ సభ్యులకు తెలియకుండా సంతకాలు పెట్టించుకుని రూ. 4లక్షలు మేరకు స్వాహా చేసింది. ఈ విషయం తెలుసుకున్న 9 మంది సభ్యురాళ్లు అధికారులు, బ్యాంకు అధికారులకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో శుక్రవారం సభకు హాజరైన కలెక్టర్‌కు తమ సమస్యను వివరించారు. దీంతో ఆయన స్పందించి 13వ తేదీ మంగళవారం చిత్తూరు కార్యాలయానికి సభ్యులందరూ ఏపీఎం శివతో కలసి రికార్డులతో రావాలని ఆదేశించారు.

చిరుధాన్యాల ఉత్పత్తికి ప్రాధాన్యం

వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి పంటరుణాల పెంపునకు సిఫార్సు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: చిరుధాన్యాల వినియోగంపై ప్రజల్లో పెరుగుతున్న ఆసక్తిని గుర్తిస్తూ, వాటి ఉత్పత్తికి జిల్లా టెక్నికల్ కమిటీ ప్రాధాన్యమిచ్చింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి చిరుధాన్యాల ఉత్పత్తికి పంటరుణ పెంపునకు సిఫార్సు చేసింది. చిత్తూరులోని డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో వివిధ బ్యాంకు, జిల్లా వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో శుక్రవారం జరిగిన సమావేశంలో ప్రతిపాదన సిద్ధం చేశారు. కొర్రలు, సామలు తదితర చిరుధాన్యాల పంటలకు ఎకరాకు రూ.12వేలు బ్యాంకు రుణాలు ఇస్తుండగా, దీనిని వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి రూ.22 వేలకు పెంచేలా కమిటీ సిఫార్సు చేసింది. అలాగే, మినుములు, పెసలు, ఉలవలు, ఇతర చిరుధాన్యాల రుణాలనూ రూ.22 వేలకు పెంచుతూ కమిటీ తీర్మానించింది. హైబ్రిడ్ రకం వరికి ఇస్తున్న రూ.42వేలను రూ.47వేలకు, శ్రీవరిసాగుకు రూ.32 వేల నుంచి రూ.35వేలకు, చెరకు (ప్లాంటేషన్)కు రూ.80 వేల నుంచి రూ.85వేలకు, నీటి ఆధారిత వేరుశనగ పంటకు రూ.32వేల నుంచి రూ.35వేలకు పెంచుతూ సిఫార్సు చేసింది. రాగులకు ప్రస్తుతం పొడి, తడి నేలలో సాగుకు ఇస్తున్న రూ.16వేలు, రూ.18 వేల రుణాలను రూ.22 వేలకు, సజ్జలు, జొన్నలు తడి, పొడి నేలల్లో పంటసాగుకు రూ.15 వేల నుంచి రూ.22 వేలకు పెంచింది. మామిడి, మల్బరీ, పత్తి, టమోట, ఉల్లిపాయ, ఉర్లగడ్డ, మునక్కాయ, పపాయ, వంకాయ, బెండకాయ, ఫ్రెంచిబీన్స్, కర్బూజా, క్యాబేజి పంటలకిచ్చే రుణాల్లో ఎలాంటి మార్పు చేయలేరు. ఎకరా మిరప పంటకు మాత్రం రుణాన్ని రూ.85వేల నుంచి రూ.75వేలకు తగ్గించింది. ఇక, ఆకుకూరల పంటలకు రూ.10వేలనుంచి రూ.20వేలకు, దనియాలకు రూ.20వేల నుంచి రూ.25 వేలకు పెంచింది. ఈ సిఫార్సులకు రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదం పొందాక ఏప్రిల్ ఒకటి నుంచి అన్ని బ్యాంకులు అమలు చేస్తాయని డీసీసీబీ సీఈవో మనోహర్ గౌడ్ తెలిపారు. ఎల్డీఎం హరీష్, నాబార్డు డీడీఎం సునీల్, వ్యవసాయశాఖ జేడీ మురళీకృష్ణ, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రభాకర్, హార్టికల్చర్ జేడీ మధుసూదన్, సెరికల్చర్ జేడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.52 కోట్లు లభించింది. బుధవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ గురువారం లెక్కించి శుక్రవారం ఉదయం ప్రకటించింది. ఇక, గురువారం 57,357 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 18,924 మంది తలనీలాలు సమర్పించారు.

పాఠ్యపుస్తకాలు లేకుండా పరీక్షలకు సన్నద్ధం ఎలా..!

పాలకుల అనాలోచిత నిర్ణయాలతో పేద విద్యార్థులకు తప్పని అవస్థలు



చిత్తూరు(విద్య), ఫిబ్రవరి 9: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీలో పాలకుల బాధ్యతారాహిత్యంపై విమర్శలు వినిపిస్తున్నాయి. పుస్తకాలు అందించకుండా మార్చి నెలలో జరిగే పబ్లిక్ పరీక్షలకు విద్యార్థులు ఎలా సన్నద్ధం అవుతారని వారి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలని కోరుకోవడం అత్యాశే అవుతుందని అధ్యాపకవర్గాలు అంటున్నాయి. విద్యా వ్యవస్థలో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టామని పదేపదే చెప్పుకునే సీఎం జగన్ పరిపాలన ఆచరణలో ఎలా ఉందన్నదానికి ఈ ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీయే నిదర్శనంగా నిలుస్తోంది. దాదాపుగా విద్యా సంవత్సరం ముగిసి మరో 20రోజుల వ్యవధిలో అంటే మార్చి ఒకటి నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. చాలామంది విద్యార్థులకు ఇప్పటికీ పుస్తకాలందలేదు. నిజానికి ఏపీలో పుష్కరకాలానికి పైగా ప్రభుత్వ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ఏటా ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించేవారు. 2008-09నుంచి 2012-13 వరకు టీటీడీ ఈ పుస్తకాలకు నిధులు ఇవ్వగా.. 2014-2020వరకు ప్రభుత్వం, ఉన్నత విద్యామండలి నిధులతో ఉచిత పాఠ్యపుస్తకాలు ముద్రించి విద్యార్థులకు పంపిణీ చేసేవారు. అయితే రెండేళ్లుగా పాఠ్యపుస్తకాలను పంపిణీ చేయలేదు. ఓల్డ్‌స్టాక్ కింద ఉన్న కొన్ని పుస్తకాలను అరకొరగా విద్యార్థులకు పంపిణీ చేసి చేతులు దులుపుకున్నారు. కొన్ని కాలేజీల్లో ప్రిన్సిపాళ్లే చొరవచూపి సీనియర్ విద్యార్థులకు ఇచ్చిన పాఠ్యపుస్తకాలను తీసి కొంతమందికి సర్దుబాటు చేయగా.. ఎక్కువసంఖ్యలో విద్యార్థులు పాఠ్యపుస్తకాలు లేకుండానే చదువులు పూర్తిచేయాల్సిన పరిస్థితి నెలకొంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో ప్రథమ ఇంటర్‌లో 51శాతం ఉత్తీర్ణతతో వెనుకబడి ఒత్తిడిలో ఉన్న అధ్యాపకులకు ఈ ఏడాదిలో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం ఎలాగని మథనపడుతున్నారు. మరోపక్క పుస్తకాలు లేకుండా చదువులు సాగించిన తమపిల్లలకు పబ్లిక్ పరీక్షల్లో ఎలాంటి ఫలితాలు వస్తాయోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంది.

ఉమ్మడిజిల్లాలో

ఉమ్మడి చిత్తూరుజిల్లాలో 62ప్రభుత్వ, 2ఏపీఆర్‌జేసీ, 16కేజీబీవీ, 18 ఏపీమోడల్, 11 సాంఘిక సంక్షేమ, 2ఏపీ ట్రైబల్ వెల్ఫేర్ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వీటిలో దాదాపు 10వేలమందికిపైగా విద్యార్థులున్నట్లు సమాచారం. కాలేజీల ప్రిన్సిపాళ్ల నుంచి అన్ని టైటిల్స్‌కు సంబంధించిన ఇండెంట్ తీసుకున్నారు గానీ పాఠ్యపుస్తకాలు మాత్రం సరఫరా చేయలేదు. పాఠ్యపుస్తకాలను ముద్రించకుండా ప్రైవేట్ మార్కెట్‌లో విద్యార్థులు కొనుక్కోవాలని ఉన్నతాధికారులు మౌఖిక ఆదేశాలు జారీచేశారు. అయితే గతేడాది జిల్లాలో గ్రౌండ్ బ్యాలెన్స్ కింద ఉన్న దాదాపు 10శాతం పుస్తకాలను కొన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు తీసుకెళ్లారని అధికారులు అంటున్నారు.

విద్యార్థులకు సర్దుబాటు చేశాం

గత అయిదేళ్ల విద్యార్థుల వద్దవద ఉన్న పుస్తకాలను సేకరించి ఈ ఏడాది పంపిణీ చేశాం. టెక్స్ట్ పుస్తకాల కొరతను తగ్గించాం. ఉత్తీర్ణత శాతం పెంచేందుకు 50 రోజుల జయిభవ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ఉదయం, సాయంత్రం వేళల్లో వివిధ సబ్జెక్టుల్లో వెనుక బడి విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నాం. మంచి ఫలితాలు వచ్చేందుకు కృషి చేస్తున్నాం.

-సయ్యద్ మౌలా , డీవీఈవో

చిత్తూరు రైల్వే స్టేషన్‌లో తనిఖీలు


రైల్వే స్టేషన్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేయిస్తున్న డీఎస్పీ

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 9: చిత్తూరు రైల్వే స్టేషన్‌లో శుక్రవారం జీఆర్‌పీ డీఎస్పీ షాను షేక్ ఆధ్వర్యంలో రైల్వే పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో ఈ తనిఖీలు నిర్వహిస్తున్నామని డీఎస్పీ తెలిపారు. ప్రత్యేకించి అంతరాష్ట్ర రైళ్లపై ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఓటర్లను ఆకటుకునేందుకు పంపిణీ చేసే వస్తువుల్లో భాగంగా.. ఫ్యాన్లు, స్టీల్ గిన్నెలు, మిక్సీలు, గొడుగులు ఇలా 24 వస్తువులను భారీగా తీసుకెళ్లేటప్పుడు బిల్లు ఉంచుకోవాలని స్పష్టంచేశారు. మద్యం బాటిళ్లతో దొరికితే జైలుకు పంపిస్తామని ఆమె హెచ్చరించారు. మద్యంతో పాటు, గంజాయిపైనా ప్రత్యేక నిఘా ఉంచామన్నారు. ఇందుకోసం డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ తనిఖీలు ప్రతీరోజూ ఉంటాయన్నారు. బంగారం, వెండితో ప్రయాణించినా వాటికి సంబంధించిన రికార్డులు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు. రికార్డులు లేకుండా దొరికే వస్తువులను సీజ్‌చేసి కేసు నమోదు చేస్తామన్నారు. గత వారం కూడా పెద్ద మొత్తంలో రికార్డుల్లేని మిక్సీలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో సీఐలు దేవేంద్రకుమార్, ఆర్‌పీఎఫ్ సీఐ కోటేశ్వరరావు, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.


ఉద్యోగుల వివరాలు సేకరణ పరిశీలిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్

ఉద్యోగుల వివరాల సేకరణ పూర్తి

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 9: జిల్లాలో ఉపాధ్యాయులు సహా 71 ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు సంబంధించి సేకరిస్తున్న ఫొటో ఓటరు గుర్తింపు కార్డు వివరాల ప్రక్రియ శుక్రవారంతో ముగిసింది. ఈ ప్రక్రియను డ్వామా పీడీ రాజశేఖర్ పరిశీలించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్దేశిత ప్రొఫార్మాలో సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు పొందుతున్న, పొందని ఉద్యోగులందరి వివరాలను సేకరించారు. సార్వత్రిక ఎన్నికల్లో పాల్గొనే ఉద్యోగులకు వారి ఓటున్న, వారు ప్రాంతం పోలింగ్ కేంద్రాల పరిధిలో విధులు కేటాయించకుండా ఈ వివరాలు సేకరిస్తున్నారు. వారం రోజులుగా కలెక్టరేట్‌లోని ఎన్ఐసీ కార్యాలయంలో ఈ ప్రక్రియ కొనసాగింది.

20కేజీల గంజాయి స్వాధీనం

నలుగురు నిందితుల అరెస్ట్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9: తమిళనాడుకు గంజాయి తరలిస్తున్న నలుగురిని తిరుపతి ఈస్ట్ పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.లక్షల విలువజేసే 20కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. తిరుపతి డీఎస్పీ సురేంద్రరెడ్డి మీడియాకు వివరాలు వెల్లడించారు. విజయవాడ అర్బన్ కృష్ణలంకకు చెందిన లేట్ కనకరావు భార్య బండారి రూపవతి (65), కృష్ణలంక రణధీర్ నగర్‌కు చెందిన కోటేశ్వరరావు భార్య బండారి కుమారి (45), విజయవాడ అర్బన్ అజిత్‌సింగ్ నగర్‌కు చెందిన నాగరాజు భార్య వీరంకి దుర్గ (52) నరసారావుపేటకు చెందిన ఓ వ్యక్తి నుంచి కేజీ రూ.5వేల చొప్పున గంజాయి కొనుగోలు చేస్తుంటారు. దానిపై మరికొంత లాభం వేసుకుని తిరుపతి సంజయ్‌గాంధీకాలనీలో నివాసముంటున్న చిత్తూరు జిల్లా నగరి మండలం ఓజికుప్పానికి చెందిన హరిప్రసాద్ కుమారుడు సత్తుపాటి లోకేశ్వరరావు (47)కు విక్రయిస్తుంటారు. ఆయన చిన్న చిన్న ప్యాకెట్లుగా విభజించి ఒక్కో ప్యాకెట్ రూ.200 చొప్పున పుత్తూరు, నగరి ప్రాంతాల్లో విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. గురువారం సాయంత్రం డీఆర్ మహల్ రోడ్డులోని రైల్వే హాలిడేహోమ్ సమీపంలో అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు మహిళలు, ఓ పురుషుడిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా 20 కేజీల గంజాయి లభించింది. దాని విలువ రూ.4 లక్షలు ఉంటుందని చెప్పారు. నిందితులపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు పంపనున్నట్టు చెప్పారు. వీరిలో ఏ1 ముద్దాయి లోకేశ్వరరావుపై గతంలో తమిళనాడులో దొంగతనం కేసులు ఉన్నాయని, వాటికి సంబంధించి జైలుశిక్ష కూడా అనుభవించాడని చెప్పారు. మహిళా నిందితుల్లో రూపవతి, వీరంకి దుర్గలపై విజయవాడ, తాడేపల్లి ప్రాంతాల్లో జూదం, గంజాయి అక్రమ రవాణా కేసులు ఉన్నట్టు వివరించారు. పెద్దమొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నందుకుగాను ఈస్ట్ సీఐ మహేశ్వర్‌రెడ్డి, ఎస్ఐ పురుషోత్తంరెడ్డి, సిబ్బంది మునిరాజులు, జ్యోతినాథ్, రవికుమార్, చిరంజీవి, మణికంఠలను అభినందించారు.

భగవన్నామస్మరణతో కష్టాలు దూరం: విద్యాధీశ తీర్థ





కార్యక్రమంలో పాల్గొన్న భజన మండళ్ల సభ్యులు - యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలు అందజేస్తున్న విద్యాధీశతీర్థస్వామి

తిరుమల, ఫిబ్రవరి 9 (ఆంధ్రజ్యోతి): కలియుగంలో యజ్ఞాలు, యాగాలు, తపస్సు చేయకపోయినప్పటికీ హరినామస్మరణ చేస్తే ఎంతటి కష్టమైనా దూరమవుతుందని ఉడిపి పాలిమారు మఠాధిపతి విద్యాధీశతీర్థ అన్నారు. తిరుమల ఆస్థానమండపంలో నిర్వహిస్తున్న పురందరదాసు ఆరాధన మహోత్సవం రెండవ రోజైన శుక్రవారం ఆయన మాట్లాడుతూ పురందరదాసు కీర్తనలు యావత్తూ లోకోక్తులేనన్నారు. మానవాళికి పురందరదాసు జీవితసారమే ఆదర్శప్రాయమన్నారు. కేవలం ధనార్జనే ప్రధానంగా భావించిన వ్యక్తి తాను ఎదుర్కొన్న కొన్ని సంఘటనల ద్వారా జ్ఞానసిద్ధిపొంది ప్రఖ్యాత హరిదాసులుగా ఖ్యాతి చెందారన్నారు. దాస పదాల ద్వారా అందరికీ అర్థమయ్యేలా సులువుగా భవవంతుని తత్వాన్ని, శరణాగతి విధానాన్ని, ధర్మాన్ని, నైతిక విలువలను తెలియజేశారని వివరించారు. అనంతరం దాససాహిత్యంలో విశేష కృషి చేసిన 12 మంది యువ కళాకారులకు ప్రతిభ పురస్కారాలను పాలిమారు మఠం ఉత్తరాధికారి విద్యారాజేశ్వరతీర్థతో కలిసి అందజేశారు. అంతకుముందు దాససాహిత్య ప్రాజెక్ట్ ప్రత్యేకాధికారి ఆనందతీర్థాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతం, ధ్యానం, సామూహిక భజన, నగర సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి 3,500 మంది భజన మండళ్ల సభ్యులు పాల్గొన్నారు.

టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుల్ మృతికి నివాళి

గణేష్ స్మారక మందిరం ఏర్పాటు : ఎస్పీ శ్రీనివాస్


గణేష్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ శ్రీనివాస్

తిరుపతి అర్బన్, ఫిబ్రవరి 9: అన్నమయ్య జిల్లా కేవీపల్లి వద్ద ఎర్రచందనం స్మగ్లర్ల కారు ఢీకొని మరణించిన కానిస్టేబుల్ గణేష్(32) మృతికి శుక్రవారం టాస్క్‌ఫోర్సు అధికారులు, సిబ్బంది కపిలతీర్థం సమీపంలోని కార్యాలయంలో ఘనంగా నివాళులర్పించారు. రైల్వే కోడూరు, కడప సబ్ డివిజన్ల నుంచి సిబ్బంది హాజరై పుష్పాంజలి ఘటించారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ టాస్క్‌ఫోర్సు కార్యాలయంలో ఒక సమావేశ మందిరానికి గణేష్ స్మారక సమావేశ మందిరంగా నామకరణం చేస్తామని తెలిపారు. సిబ్బంది వ్యక్తిగత రక్షణపై శిక్షణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గణేష్ కుటుంబానికి తగిన సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. ఆయన మరణానికి కారకులను పట్టుకుని శిక్ష పడేలా చేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ చెంచుబాబు, ఆర్ఐ(ఏఆర్) సురేష్‌కుమార్ రెడ్డి, సీఐలు శ్రీనివాసులు, సురేష్‌కుమార్, ఆర్ఐలు కృపానంద, చిరంజీవులు, ఏసీఎఫ్ శ్రీనివాస్, ఎఫ్ఆర్వో మురళీకృష్ణ పాల్గొన్నారు.

టీచర్లు లేని ఇంగ్లిష్ మీడియం ఎందుకు?


పోస్టర్లను విడుదల చేస్తున్న దళిత సంక్షేమ సేవా సంఘం సభ్యులు

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 9: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంగ్లిష్ మీడియం చదువులు ప్రకటనలకే పరిమితమయ్యాయని, కనీసం ఆ సబ్జెక్టు చెప్పడానికి టీచర్లు లేకపోవడమే ఇందుకు నిదర్శనమని దళిత సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ విమర్శించారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాల డబ్బంతా తిరిగితిరిగి మద్యం దుకాణాలకే వెళుతోందన్నారు. దళితుల భూములను అగ్రవర్ణాల వారు కొనుగోలు చేసి, రెగ్యులరైజ్ చేసుకుని కోట్లు గడిస్తున్నారని పేర్కొన్నారు. దళితుల వద్దనున్న డీకేటీ పట్టాలకు బ్యాంకుల్లో రుణాలు ఇచ్చే ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ప్రసాద్, జశ్వంత్, బాబు, మునికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సెలెక్ట్ మొబైల్‌షాప్ మేనేజర్‌పై కేసు


బాలకృష్ణ

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 9: తిరుపతి సెలెక్ట్ మొబైల్‌షాప్ మేనేజర్ బాలకృష్ణపై కేసు నమోదైంది. కంపెనీకి చెందిన రూ.8.88 లక్షల మొత్తాన్ని కాజేసినందుకుగాను ఆయనపై పోలీసులు కేసునమోదు చేశారు. స్థానిక తిలక్ రోడ్డులోని కృష్ణతులసి ప్యారడైజ్ గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉన్న సెలెక్ట్ మొబైల్ షాప్ స్టోర్ మేనేజర్‌గా పి.బాలకృష్ణ పనిచేస్తున్నారు. ఇటీవల ఆడిట్ నిర్వహించగా లక్షల రూపాయల నగదుకు సంబంధించి లెక్క తేలలేదు. మేనేజర్‌ను ప్రశ్నించినా ఆయన సరైన సమాధానం ఇవ్వలేదు. షోరూమ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్ అరుణ్‌తో కలిసి మేనేజర్ కంపెనీకి చెందిన రూ.8,88,530 సొంతానికి వాడుకున్నట్లు గుర్తించిన సెలెక్ట్ మొబైల్ షోరూమ్ అధికారి, హైదరాబాద్‌కు చెందిన నాగరాజు ఈ నెల 7వ తేదీన ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు బాలకృష్ణ, అరుణ్‌పై కేసు నమోదు చేసిన ఈస్ట్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహేతర సంబంధానికి అడ్డొస్తున్నాడనే హత్య...

● పాతిపెట్టిన మృతదేహానికి పోస్టుమార్టం
● హత్యకేసులో ముగ్గురు అరెస్ట్


కేసు వివరాలను మీడియాకు వివరిస్తున్న డీఎస్పీ కేశప్ప

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 9: ప్రియుడితో కలసి ఓ మహిళ తన భర్తను హత్యచేసినట్లు మదనపల్లి డీఎస్పీ కేశప్ప తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం సాయంత్రం కేసు వివరాలను ఆయన మీడియాకు వెల్లడించారు, మదనపల్లి మండలం చీకలబైలుకు చెందిన మండెం శ్రీనివాసులు భార్య గీతమ్మతో అదే పంచాయతి ఎగువ దొనబైలుకు చెందిన ప్రసాద్‌తో పరిచయం ఏర్పడింది. దీంతో రోజు రోజుకు వారి మధ్య సాన్నిహిత్యం మరింతపెరిగి వివాహేతర సంబంధానికి దారితీసింది. దీనిపై గీతమ్మ భర్త శ్రీనివాసులు తరుచు గొడవపడేవారు, ఈ క్రమంలో విషయాన్ని గీతమ్మ ప్రియుడు ప్రసాద్ కు చెప్పడంతో శ్రీనివాసులును అడ్డు తొలగించు కోవాలని పథకం పన్నారు. ఇదే విషయాన్ని గీతమ్మ ఎగువ దొనబైలులో ఉంటున్న తండ్రి రామస్వామికి తెలిపింది, అనంతరం జనవరి 27న మద్యం మత్తులో తన ఇంటిలో నిద్రిస్తున్న భర్త శ్రీనివాసులును గీతమ్మ ప్రియుడు ప్రసాద్ బండతో తలపై బాది హత్య చేశాడు. అనతరం మృతదూహాన్ని వారందరూ కలసి కర్ణాటక సరిహద్దు అటవీ ప్రాతంలో పూడ్చి పెట్టారు. అనంతరం గీతమ్మ తన భర్త కనిపిండంలేదని గత నెల 27న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో తాలూకా పోలీసులు అదృశ్యం కేసును నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా పోలీసులు తన ధైన శైలిలో విచారణ చేపట్టడంతో నిందితులు అసలు విషయాన్ని అంగీకరించారు. ఇందులో భాగంగా శుక్రవారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని తహసీల్దార్ రమాదేవి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ క్రమంలో ముగ్గురు నిందితులైన ప్రసాద్, గీతమ్మ, రామస్వామిలను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఒక ద్విచక్రవాహనం, 3సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకొన్నారు. ఈ కేసు విచారణలో తాలూకా, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు శేఖర్, వలీబసు, యువరాజు, ఎస్ఐలు వెంకటసుబ్బయ్య, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్‌పై పోలీసులకు ఫిర్యాదు

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 9 : ఓ వలంటీర్ పై పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన పీటీఎం మండలంలోని సంపతికోట పంచాయతీ కానుగమాకులపల్లెలో చోటు చేసుకుంది.వివరాలు ఇలా ఉన్నాయి. కానుగమాకులపల్లెకు చెందిన కృష్ణమూర్తి అనే ఓ రైతు రోడ్డులో ఇంటి ముందు తన ట్రాక్టర్‌ను నిలిపి ఉంచాడు. ఇదే గ్రామానికి చెందిన వలంటీర్ విశ్వనాథ్ అనే వ్యక్తి తనపై గొడవ చేసి దూషించి కర్రతో ట్రాక్టర్ హెడ్‌లైట్ పగల కొట్టి తనపై దాడికి దిగాడని శుక్రవారం పీటీఎం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయంపై స్థానిక ఎస్ఐను వివరణ కోరగా బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, గ్రామానికి వెళ్లి విచారించి అతనిపై చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

వెట్టిచాకిరి పనులను నిర్మూలించాలి


కార్మికులకు అవగాహన కల్పిస్తున్న కార్మికశాఖ అధికారులు, కోర్టు సిబ్బంది

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 9: కార్మికుల చేత వెట్టిచాకిరి పనులను నిర్మూలించాలని అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ రంగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బసినికొండ వద్ద మండల న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో కార్మికులను అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగరాజు మాట్లాడుతూ కార్మిక చట్ట ప్రకారం కార్మికులకు కొన్ని హక్కులు, పని కాలం ఉంటుందన్నారు. దీన్ని మించి పనులు చేయిస్తూ తక్కువ కూలి ఇస్తుంటే లేబర్ అధికారులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్మికులు పనిచేస్తున్న చోట వారికి సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ ఎం.రాజయ్య, న్యాయవాది మహ్మద్‌హుస్సేన్ దాదాపీర్, పారా లీగల్ వలంటీర్లు కృష్ణమూర్తి, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

బీటీ కళాశాలపై ప్రకటన వైసీపీ దగా

● యూనివర్సిటీ చేశామంటూ మోసం ● పవిత్రమైన స్థలంలో క్షీరాభిషేకంతో అపవిత్రం ● టీడీపీ, జనసేన, సీపీఐ నేతల ధ్వజం


నిరసన తెలుపుతున్న జనసేన, టీడీపీ, సీపీఐ నేతలు రామ్‌దాస్‌చౌదరి, ఆర్.జె.వెంకటేష్, మురళి

మదనపల్లె, ఫిబ్రవరి 9: రాయలసీమలోనే చరిత్రాత్మక మదనపల్లె బీటీ కళాశాల అంశంలో వైసీపీ రోజుకోమాటా, పూటకో ప్రకటనతో ప్రజలను మోసం చేస్తోందని అఖిలపక్ష నేతలు ధ్వజమెత్తారు. బీటీ కళాశాలను ప్రభుత్వం యూనివర్సిటీ చేస్తూ క్యాబినెట్‌లో ఆమోదించిందంటూ అబద్దాలు చెప్పడాన్ని రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్ చౌదరి, టీడీపీ నేత ఆర్‌జే వెంకటేష్, సీపీఐ నేత మురళిలు ఖండించారు. అసలు బీటీ కళాశాల ఇంకా పూర్తిగా ప్రభుత్వ పరమే కాలేదని, అలాంటిది యూనివర్సిటీ అయిపోయిందని, ఆపార్టీ నేతల నుంచి ఎంపీ మిథున్‌రెడ్డి వరకూ ప్రకటన చేయడాన్ని వారు తప్పుపట్టారు. ఇందులో భాగంగా ఆపార్టీ నేతలు రెండురోజుల క్రితం బీటీ కళాశాలలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి సీఎం జగనమోహన్‌రెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డిలు ఏదో పెద్దగా సాధించేసినట్లు వారి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేయడాన్ని వారంతా ముక్తకంఠంతో వ్యతిరేకించారు. వారి చర్యలతో పవిత్రమైన బీసెంట్ హాలు అపవిత్రం చేశారని పేర్కొన్నారు. వచ్చే సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే, ఇలాంటి తప్పుడు ప్రకటనలతో రాయలసీమ ప్రజలను మరోసారి మోసగించడానికి ప్రయత్నం చేస్తున్నట్లు రామ్‌దాస్‌చౌదరి పేర్కొన్నారు. ఇలాంటి ప్రకటనలతో ప్రెస్‌మీట్లు, కార్యక్రమాలు నిర్వహణకు మీరు ఎలా అనుమతిస్తారని వారంతా-శుక్రవారం బీటీ కళాశాలకు చేరుకుని ప్రిన్సిపాల్, వైస్‌ప్రిన్సిపాల్‌ను నిలదీశారు. పట్టణ ప్రజల్ని, పూర్వవిద్యార్థుల్ని, మీడియా, రాజకీయలోకాన్ని మోసం చేస్తున్నట్లు రామ్‌దాస్‌చౌదరి పేర్కొన్నారు. ఇప్పటికే జిల్లా ప్రకటనతో ఇక్కడి ప్రజల్ని, ఈ ప్రాంత మనోభావాల్ని దెబ్బతీయగా, తాజాగా మరోకొత్తరకం మోసాన్ని తెరపైకి తెచ్చారని ఎద్దేవా చేశారు. ఈ మోసాన్ని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు రామ్‌దాస్‌చౌదరి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, జనసైనికులు గ్రానైట్ బాబు, సనావుల్లా, గజ్జల రెడ్డెప్ప, కావలి రెడ్డెమ్మ, సరోజ, నాగవేణి, జంగాల గౌతమ్, గండికోట లోకేష్, చంద్రశేఖర్, కుమార్, లవన్న, రాజారెడ్డి, జనార్దన్, నరేష్, విజయ్ కుమార్, గంగులప్ప పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి


కలికిరిలో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న జేసీ ఫర్మాన్ అహ్మద్

పీలేరు, ఫిబ్రవరి 9: సార్వత్రిక ఎన్నికల కోసం సిద్ధం చేసిన పోలింగ్ కేంద్రాల్లో వసతుల కల్పనపై దృష్టి సారించాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ సెక్టోరల్ అధికారులను ఆదేశించారు. పీలేరు నియోజకవర్గంలోని సెక్టోరల్ అధికారులతో శుక్రవారం ఆయన పీలేరు తహసీల్దారు కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో వెలుతురు, తాగునీరు, టాయిలెట్స్ వంటి సౌకర్యాలు ఉండేలా చూడాలన్నారు. అనంతరం ఆయన పీలేరు పట్టణంలోని జడ్పీ మెయిన్ ఉన్నత పాఠశాల, ఏఎంసీ ప్రాంగణం, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిక పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఆయా కేంద్రాలలో విద్యుదీకరణ, తాగునీటి సదుపాయం, టాయిలెట్స్, వాటి కోసం నీటి వసతిని పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ పోలింగ్ కోసం వచ్చే ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రశాంత వాతావరణంలో వారు ఓటు వేసుకునే విధంగా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈఆర్వో రమాదేవి, తహసీల్దారు మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు, వయోవృద్ధ ఓటర్లను గుర్తించాలి

కలికిరి, ఫిబ్రవరి 9: అన్ని పోలింగ్ కేంద్రాల పరిధిలోని దివ్యాంగులు, వయో వృద్ధుల ఓటర్లను గుర్తించి ఆ మేరకు ప్రత్యేక జాబితాలను సిద్ధం చేసుకోవాలని జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ సూచించారు. మండలంలోని పలు ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. దివ్యాంగులు, 80 ఏళ్ల పైబడిన వయో వృద్ధులు కోరితే వారికి ఇంటి వద్దనే ఓటు హక్కు వినియోగించే సౌకర్యం కల్పించాల్సి ఉంటుందన్నారు. కలికిరి పట్టణంలోని కేంద్రాలతోపాటు శివారు ప్రాంతాల్లోని బొమ్మరవాండ్లపల్లె, గుట్టపాళెం పంచాయతీలోని ఐదు పోలింగ్ కేంద్రాలతో కలిపి మొత్తం 13 కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లోనూ విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, ర్యాంపుల ఏర్పాటు తదితర అంశాలను పరిశీలించాలన్నారు. తహసీల్దారు విజయకుమారి, బీఎల్వోలు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ములకలచెరువులో: పోలింగ్ కేంద్రాలో ఖచ్చితంగా వసతులు ఉండేలా చర్యలు తీసుకోవాలని తహ సీల్దార్ అనీల్‌కుమార్ ఆదే శించారు. ములకలచెరువు, మద్దినాయనిపల్లెలలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పోలింగ్ కేంద్రంలో తాగునీటి, లైటింగ్ వసతులు కల్పించేందుకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు చర్య లు చేపట్టామన్నారు. ఆయన వెంట ఆర్ఐ ఆంజనేయులు, పోలింగ్ కేంద్రాల అధికారులు తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ


స్వామివారి పూజా సామగ్రి తీసుకువస్తున్న టీటీడీ అధికారులు

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 9: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు శుక్రవారం సాయంత్రం శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగా వైభవంగా నిర్వహించనున్నారు. ఈ క్రమంలో శుక్రవారం వేకువనే స్వామి వారిని సుప్రభాతసేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు చేశారు. సాయం త్రం 6 గంటల నుంచి వేదపండితుల మంత్రోచ్చారణలతో బ్రహ్మోత్సవాలకు ఆగమోక్తంగా అంకురార్పణ చేపట్టారు. కాగా శనివారం ఉదయం 10:35 నుంచి 11:30 మధ్య ధ్వజారోహణం, సాయంత్రం 8 గంటల నుంచి పల్లకీ ఉత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసమంగాపురం టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, సూపరింటెండ్ మునిచెంగల్రాయులు, ఉప ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్ కుమార్, అర్చకులు రమేశ్ స్వామి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్


విద్యార్థులను అభినందిస్తున్న గురుప్రసాద్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 9: మదనపల్లెకు చెందిన ఐదుగురు విద్యార్థులకు ఎస్వీ యూనివర్సిటీ స్పోర్ట్స్ మెరిట్ స్కాలర్‌షిప్ మంజూరు చేసిందని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఎస్వీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన క్రీడల పోటీల్లో తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపరిచారన్నారు. వారికి ఎస్వీ యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ ఎం.శివకుమార్‌రెడ్డి ఒక్కో విద్యార్థికి రూ.6వేలు చొప్పున మొత్తం రూ.30వేలు మెరిట్‌స్కాలర్ షిప్ చెక్కులను పంపించారన్నారు. ఎం.మైత్రేయిసాయి(హాకి), బి.గంగాధర్(హాకి), ఏ మనోజ్ఞ(హాకి), బి.రేణుక(చెస్), ఎం.నవ్య(వాలీబాల్)కు చెక్కులు వచ్చాయన్నారు. ప్రిన్సిపాల్ రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేంద్ర విద్యార్థులను అభినందించారు.

న్యూ ఏజ్ టెక్నాలజీ షోలో మిట్స్ విద్యార్థుల ప్రతిభ


ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 9: మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు న్యూ ఏజ్ టెక్నాలజీ షో పోటీలలో ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ తెలిపారు. హర్యాణాలోని ఎన్‌పీఆర్ బయోటెక్ సైన్స్ క్లస్టర్ డీబీటీ టెస్ట్ ఆర్‌సీబీ క్యాంపస్‌లో 9వ ఇంటర్నేషనల్ ఫెస్టివల్ పోటీలను జాతీయస్థాయిలో నిర్వహించారు. ఈ పోటీలలో కళాశాల తృతీయ, ద్వితీ య సంవత్సరం ఏఐ విభాగానికి చెందిన విశ్వ నాథ్, ఆరీఫ్, తృతీయ సంవత్సరం డేటా సైన్స్ విభాగానికి చెందిన బిందుశ్రీ, జయశ్రీలు బ్యాటరీతో పని చేసే ఆటోమేటివ్ సెల్ఫ్ డ్రైవ్ కార్ తయారీ విధానం ప్రాజెక్టును పోటీలలో ప్రదర్శించారు. ఈ ప్రాజెక్టుకు ప్రశంసా పత్రాలను మెమెంటోలను అందజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయ భాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కీర్తి, ప్రిన్సిపాల్, విభాగాధి చొక్కానాధమ్ అభినందించారు.

పదిలో మంచి ఫలితాలు సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ జాకీర్ హుస్సేన్

గుర్రంకొండ, ఫిబ్రవరి 9:విద్యార్థులు పదిలో మంచి ఫలితాలను సాధించాలని సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు జాకీర్‌హుస్సేన్ అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలో మంచి మార్కులు సాధించాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు హాస్టల్‌లో అమలు చేస్తున్న మోనూను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వార్డెన్ శంకరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

16న భారత్ బంద్‌ను విజయవంతం చేయాలి

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 9: పరిశ్రమల్లోని కార్మికులు, సంఘటిత, అసంఘటిత వ్యవసాయ కార్మికులు ఫిబ్రవరి 16న భారత్‌బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్పలు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో భారత్‌బంద్-పారిశ్రామిక సమ్మె సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ అవలంబిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు రైతుల పాలిట శాపాలుగా మారాయన్నారు. నాలుగు లేబర్‌కోడ్స్ మూలంగా పరిశ్రమల్లో సంపద సృష్టించే కార్మికులకు ఏ హక్కులు లేని బానిసలుగా మార్చారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర సంస్థల్లో 23 లక్షలకు పైగా ఖాళీగా ఉన్నాయన్నారు. కార్మికులకు కనీసవేతనం రూ. 26 వేలు ప్రకటించాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధరను కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు తిరుమల, దేవా, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సురేష్‌కుమార్, మస్తాన్, సలీంబాష, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీల సంక్షేమానికి పెద్దపీట


జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌యాదవ్

పెద్దమండ్యం, ఫిబ్రవరి 9: తెలుగుదేశం పార్టీ బీసీల సంక్షేమం కోసం పెద్దపీట వేసిందని తంబళ్లపల్లి టీడీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే జి.శంకర్‌యాదవ్ పేర్కొన్నారు. పెద్దమండ్యంలో శుక్రవారం టీడీపీ, జనసేన జయహో బీసీ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులను కోరారు. టీడీపీ, జనసేన సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్రంలో చంద్రబాబు సీఎం అవుతారని తెలిపారు. అలాగే తంబళ్లపల్లిలో టీడీపీ జనసేన పార్టీల జెండా ఎగురవేయాలన్నారు. టీడీపీ మ్యానిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టాలన్నారు. ఓటర్ల జాబితాలో దొంగ ఓటర్లను తొలగింపుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్ఎం పర్వీన్‌తాజ్ మాట్లాడుతూ టీడీపీ, జనసేన కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. ముందుగా పెద్దమండ్యంలో టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో జయహో బీసీ ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ బీసీ ఉపాధ్యక్షుడు సిద్దప్ప, మండల టీడీపీ కన్వీనర్ జిట్టా వెంకటరమణ, రాజంపేట పార్లమెంట్ టీడీపీ బీసీ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, తంబళ్లపల్లి నియోజక వర్గం బీసీ నాయకులు బిక్కా మధుకర, వేంపల్లి రఫీ, గంగాధర, మహేశ్వర, శ్రీనివాసులు, రెడ్డమ్మ, శంకర, రాష్ట్ర టీడీపీ ఎస్టీ సెల్ కార్యదర్శి బుక్కే మనోహర్‌నాయక్, సెల్ నాయకుడు నటరాజ్ నాయక్, నియోజక వర్గ జనసేన నాయకుడు సాయినాథ, అస్రఫ్, శంకర, ఆనంద, శ్రీనాధ టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముస్లిం ధార్మిక కార్యక్రమాలపై రాజకీయలబ్ధి ప్రకటనలా!

● టీడీపీ ముస్లిం మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధక్షుడు మస్తాన్


మాట్లాడుతున్న టీడీపీ ముస్లిం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మస్తాన్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 9: గుంటూరులో ముస్లింలందరూ కలసికట్టుగా నిర్వహించుకుంటున్న ధార్మిక సదస్సు(ఇస్తిమా) కార్యక్రమాన్ని వైసీపీ నాయకులు రాజకీయ లబ్ధి కోసం తప్పుడు ప్రకట నలు, ప్రచారాలు చేస్తుండటం సిగ్గుచేటని టీడీపీ ముస్లిం మైనారిటీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్ఏ మస్తాన్ ధ్వజమెత్తారు. శుక్రవారం మదనపల్లెలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎంపీ మిథున్‌రెడ్డి సీటీఎం రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేక రైలును గుంటూరు ఇస్తిమాకు ఉచితంగా ఏర్పాటు చేశారని మదనపల్లె వైసీపీ సమన్వ యకర్త నిస్సార్‌అహ్మద్, మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ ఇక్బాల్‌అహ్మద్, ఉర్దూ అకాడమి డైరెక్టర్ అబ్దుల్‌ఖలీం, వక్ఫ్‌బోర్డు జిల్లా చైర్మన్ ఎస్ఏ కరీముల్లా ప్రకటించడం దారుణమ న్నారు. దేశంలో ఎక్కడైనా ఇస్తిమా కార్యక్రమాలు నిర్వహిస్తే కేవలం ఆయా ప్రభుత్వాల సహకారం మాత్రమే తీసుకుంటారని, రాజకీయ నాయకుల నుంచి ఎలాంటి విరాళాలు సేకరించరన్నారు. ఎవరైనా సహాయంచేసినా దాన్ని గుప్తంగానే ఉంచుతారన్నా రు. ఇలాంటి ప్రకటనలు ఇచ్చిన వారు భేషరతుగా ముస్లింలకు క్షమాపణలు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. క్రార్యక్రమంలో ముస్లిం నేతలు దాదాపీర్, బావాజాన్ పాల్గొ న్నారు.

విద్యార్థుల సంపూర్ణ వికాసం కోసమే డీవార్మింగ్


విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్న ఇంతియాజ్

పీలేరు, ఫిబ్రవరి 9: విద్యార్థుల్లో సంపూర్ణ వికాసం, ఎదుగదల కోసమే డీవార్మింగ్ చేపడుతున్నట్లు జిల్లా ఎన్‌డీడీ కార్యక్రమ ప్రత్యేక పరిశీలకుడు డాక్టర్ ఇంతియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం ఆయన పీలేరు మండలం తలపులలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక, పోషకాహార లోపాల నిర్మూలన కోసం ఆల్బెండజోల్-400 మాత్రలను ప్రతి విద్యార్థి విధిగా తీసుకోవాలన్నారు. అనివార్య కారణాల వల్ల తప్పిపోయిన విద్యార్థులకు ఈ నెల 16వ తేదీన మరోమారు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు చంద్రశేఖర్, శివయ్య, కార్తీక్ కుమార్, ప్రిన్సిపాల్ రాధారణి, హెచ్ఈలు ఉషారాణి, కొండయ్య, ఎంపీహెచ్‌వ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు రమాదేవి, చిన్నబ్బ, పవన్ కుమార్, కుసుమ, ఏఎన్ఎంలు భార్గవి, నాగవేణి, సీహెచ్‌వోలు జయలక్ష్మి, కుముద, కవిత, సిబ్బంది పాల్గొన్నారు.


నులి పురుగుల నివారణపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్లు

కలకడలో: జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఎర్రయ్యగారిపల్లె, బాటవారిపల్లె, పాపిరెడ్డిగారిపల్లె, దేవలపల్లె అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యక్రమం జరుగుతున్న తీరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులకు మాత్రలు మింగించాలన్నారు. ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ పరిధిలో 1371 మందికి మాత్రలు పంపిణీ చేశామన్నారు. డాక్టర్ మల్లికార్జున, సిబ్బంది పాల్గొన్నారు.


పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు మింగిస్తున్న ఎంఈవో త్యాగరాజు

తంబళ్లపల్లెలో: నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంఈవో త్యాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల వ్యాప్తంగా కోసువారిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి అనుపమ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలలు, కళాశాలల్లో ఏడాది నుంచి 19 సంవత్సరాల లోపు పిల్లలకు ఆల్బెండాజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 5625 మందికి గానూ 5412 మంది చేత ఆల్బెండాజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆనంద్‌కుమార్, ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు, వైద్యసిబ్బంది, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓపెన్‌డే

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 9: మదనపల్లె పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓపెన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికల జూనియర్ ప్రిన్సిపాల్ ఆర్.కృష్ణవేణి కళాశాల విద్యార్థులకు, అధ్యాపకులకు డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న విద్యాబోధన, సౌకర్యాల గురించి వివరించారు. తమ కళాశాలలో అధునాతన జిమ్, ల్యాబోరేటరి, డిజిటల్ తరగతి గదులు ఉన్నాయన్నారు. మదనపల్లె ప్రాంత మహిళలకు బీఎస్సీ ఆనర్స్, బీకామ్ ఆనర్స్, బీఏ ఆనర్స్ బీఏ స్పెషల్ తెలుగు, బీకామ్ కంప్యూటర్స్ గ్రూపులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి, అధ్యాపకులు మోహనవల్లి, సూర్యశేఖర్‌రెడ్డి, ఖాజావలి, భవాని, విష్ణుప్రియ, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలి


భద్రతా వారోత్సవాల్లో మాట్లాడుతున్న ఎంవీఐ విజయ కుమారి

పీలేరు, ఫిబ్రవరి 9: వాహనదారులు రోడ్డు నిబంధనలు తప్పకుండా పాటించాలని పీలేరు ఎంవీఐ విజయ కుమారి పేర్కొన్నారు. 35వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలలో భాగంగా శుక్రవారం పీలేరు ఎంవీఐ కార్యాలయంలో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వాహనాలను నిర్లక్ష్యంగా నడిపేవారు, రికార్డులు సరిగ్గా నిర్వహించని వాహన యజమానులపై కఠినంగా వ్యవహరిస్తున్నామన్నారు. అనంతరం పట్ట ణంలోని డ్రైవర్లకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పీలేరు అర్బన్ సీఐ మోహన్ రెడ్డి, ఆర్టీసీ డీఎం బండ్ల కుమార్, లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సురేంద్రనాథరెడ్డి, సుబ్రహ్మణ్యం, 'షీ' సంస్థ అధ్యక్షురాలు వీవీ ఎస్ లక్ష్మి, సభ్యులు రాయల సుధాకర్, కంటి వైద్య నిపుణులు ఆనంద్ రెడ్డి, హేమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో: రహదారి భద్రతా నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాల నుంచి బయటపడవచ్చని ఎస్ఐ శివకుమార్ అన్నారు. శుక్రవారం తంబళ్లపల్లెలో వాహదారులకు రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ..ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపకూడదని, మైనర్లు వాహనాలు నడిపితే యాజమానిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దుకాణాల ముందు రోడ్డుకు అడ్డంగా వాహనాలు పెట్టకూడదని దుకాణాదారులను హెచ్చరించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోండి

వాల్మీకిపురం, ఫిబ్రవరి 9: వాల్మీకిపురం జూనియర్ సివిల్ కోర్టులో మార్చి నెల 9వ తేదీన జరగనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఇన్‌ఛార్జి జడ్జి జ్యోతి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సివిల్, క్రిమినల్, బ్యాంకుల రుణాల కేసులతో పాటుగా రాజీ కాదగ్గ ప్రతి కేసును పరిష్కరించుకోవడానికి లోక్ అదాలత్ చక్కటి వేదిక అన్నారు. కక్షిదారులు జీవితాలను దుర్భరం చేసుకోకుండా అలాగే కోర్టులో ప్రతిరోజు ప్రీ సిట్టింగ్ నిర్వహించడం జరుగుతోందని, కేసులు రాజీ చేసుకునే వారు సంప్రదించవచ్చన్నారు.